VISALAANDHRA, VIJAYAWADA—Phone No. 376

రిజిష్టర్డు నెం. 6097. 4 పేజీలు : ఒక అణా

విశాలాంధ్ర

సంపుటి 2 ★ విజయవాడ : శుక్రవారం; జూన్ 26, 1953 ★ సంచిక 100

మాస్కోలో ఇందిరా గాంధీ

మాస్కో, జూన్ 24

శ్రీమతి ఇందిరాగాంధీ నేడు మాస్కో చేరుకుంది. ఇక్కడ జూలై రెండవ తేదీవరకు ఆమె సోవియట్‌లో సంచారం చేస్తుంది. టాష్కెంట్, సామర్కండ్ మొదలైన ప్రపంచ ప్రసిద్ధ ప్రదేశాలను సందర్శిస్తుంది.

సోవియట్‌లో కొత్తరుణం జారీ

మాస్కో, జూన్ 24

సోవియట్ ప్రభుత్వం నేడు 1,600 కోట్ల రూబుల్సుకు కొత్త రుణ పత్రాలు జారీచేసింది. ఈ రుణపత్రాలపై ఏలాంటి వడ్డీ ఉండదనీ, 20 ఏళ్ళ తరువాత చెల్లిస్తారని ప్రకటించారు.

జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠంచేసేందుకే ఇవి ఉద్దేశింపబడినవన్నారు. ఈ 20 ఏళ్ళలో నూటికి 35 వంతులు పత్రాలమీద నూరు రూబెల్సు [illegible] మొదలు 200 రూబుల్సు వరకు లాటరీ బహుమానాలుంటాయి.

బళ్లారి ఆంధ్రుల సత్యాగ్రహానికి రాష్ట్రకాంగ్రెస్ అసమ్మతి

విజయవాడలో కార్యవర్గ తీర్మానం

రామచంద్రపురం ఉపఎన్నికలో పోటీచేయరాదని నిర్ణయం

కాళహస్తినుండి శ్రీ సంజీవరెడ్డి పోటీ

విజయవాడ, జూన్ 25

జస్టిస్ మిశ్రాతీర్పుకు నిరసనగా బళ్లారి ఆంధ్రులు ప్రస్తుతం సాగించుతున్న సత్యాగ్రహోద్యమానికి తన అసమ్మతిని తెలుపుతూ నేడిచ్చట సమావేశమైన ఆంధ్ర ప్రదేశ కాంగ్రెసు సంఘ కార్యవర్గం తీర్మానించింది.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం నేటి ఉదయం 9 గంటలకు ఆంధ్రరత్న భవనంలో శ్రీ నీలం సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. మొత్తం 21 మంది కార్యవర్గ సభ్యులకు 15 మంది హాజరైనారు.

బళ్లారి ఆంధ్రుల సత్యాగ్రహంపై కార్యవర్గం ఆమోదించిన తీర్మానంలో యిలా వుంది:

“ఆంధ్రరాష్ట్రానికి, దానికి అన్ని వైపులావున్న రాష్ట్రాలకూ మధ్యవున్న సరిహద్దులను నిర్ణయించుటకుగాను కొంత కాలంలో సరిహద్దు నిర్ణాయక సంఘం నియమించబడనున్నది. ఇందువలన దీని దృష్ట్యా ప్రస్తుతం బళ్ళారిలో జరుగుచున్న ఆందోళనను, ముఖ్యంగా శాసనధిక్కారానికి ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం తన అసమ్మతిని తెలియజేస్తోంది. ఈ చర్యలు ఉద్యమానికే హానికరమని కమిటీ భావిస్తోంది. ఆంధ్రుల న్యాయమైన హక్కుల సాధనలో సరిహద్దుసంఘంనుండి న్యాయం పొందేందుకు తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని కమిటీ ఆంధ్ర ప్రజలకు హామీ యిస్తున్నది.

తిరుత్తణిలో తమిళులు సాగించుతున్న ఆందోళనకుకూడా యీ కమిటీ తన వ్యతిరేకతను తెలియజేస్తోంది. తమ కోర్కెలను సరిహద్దు సంఘానికి నివేదించవలసినదిగా తిరుత్తణి తమిళులను యీ కమిటీ కోరుతోంది.”

రామచంద్రపురం కాళహస్తి నియోజక వర్గాలు

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలకు కాంగ్రెసుఅభ్యర్థిని నిలుపరాదని కమిటీ నిర్ణయించింది. దీనికి కారణం, “ప్రస్తుతంప్రజాస్వామిక పక్షాలమధ్య సుహృద్భావ వాతావరణమే”నని, నూతనాంధ్రలో దీనినినిలపాలసిన అవకాశం యివ్వాలని కమిటీ చెప్పినప్పటికీ అసలు కారణంమాత్రంవేరుగా వున్నదని తెలుస్తోంది. ఈ నియోజకవర్గానికి మొదట పళ్ళంరాజుగారిని పెట్టాలనుకున్నారట. కాని ఆయనను గనుక పెట్టితే, ఓడిపోవడం తథ్యమని తూర్పు గోదావరి కాంగ్రెసువాదులు వాదించారు. పోనీ శ్రీ కళా వెంకట్రావు పెట్టాలన్నా, ప్రజా సోషలిస్టు పార్టీ సపోర్టు చేసినప్పుడే ఆయన గెలవడానికి అవకాశముంటుందని, కాని ప్రకాశం మాత్రం ఎట్టి పరిస్థితులలోను ఆయనను సపోర్టు చేయడని కాంగ్రెసు నాయకులు అంటారు. పదవుల పంపకంకోసం సంజీవరెడ్డి, ప్రకాశంగారలుజతకట్టినట్లు కనిపించినా, ప్రకాశంగారు మాత్రం యీ విషయంలో కర్నూలు పార్లమెంటు సీటుకు చేసినట్లే చేస్తాడని కాంగ్రెసువారి భయం. చివరకు ఈ గుంపుచింపులన్నీ అయినాక, తన అభ్యర్థిని నిలబెట్టరాదనే కార్యవర్గం నిశ్చయించింది. నేటి సమావేశంలో కొందరు సభ్యులు, కాంగ్రెసు అభ్యర్థిని నిలబెట్టాలని గట్టిగా వాదించారట.

కాళహస్తి నియోజకవర్గం ఉపఎన్నికలలో శ్రీ సంజీవరెడ్డిని నిలబెట్టాలని కార్యవర్గం నిర్ణయించింది. ఇందుకు బదులు, సంజీవరెడ్డిగారికోసం ఖాళీ చేసిన బలరామరెడ్డిగారికి స్టేట్స్ కౌన్సిలులో సభ్యత్వం ప్రసాదించనున్నారని కూడా రూఢిగా తెలుస్తోంది.

ఏ. ఐ. సి. సి. కి బాకీ రద్దుచేయాలని అభ్యర్థన

కార్యవర్గం ఆమోదించిన మరో తీర్మానంలో ఏ. ఐ. సి. సి. కి రాష్ట్ర కాంగ్రెసు యివ్వవలసిన రు. 2800 లు బకాయిని రద్దు చేయవలసినదిగా కోరారు. పుత్తూరు, పార్వతీపురం ఉపఎన్నికలలో కాంగ్రెసు ‘అమితమైన’ మొత్తం ఖర్చుచేయవలసి వచ్చిందనీ, చాలా జిల్లా కాంగ్రెసు సంఘాలు సభ్యత్వరుసుం చెల్లించలేదని యిందుకు కారణాలుగా వుదహరించారు.

కడపజిల్లాలో కాంగ్రెసు సభ్యత్వం చేర్పించుట, తదితర విషయాలు సక్రమంగా లేనందున జిల్లా కాంగ్రెసు స్థానే నలుగురితో ఒక అడ్‌హాక్ కమిటీని కార్యవర్గం నియమించింది. కడపజిల్లానుంచి ఎన్నికయిన రాష్ట్ర కాంగ్రెసు సభ్యులు యీ కమిటీలో వుంటారు.

ఆంధ్రలో స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రకు సంబంధించిన భోగట్టాను ఏ. ఐ. సి. సి. కి పంపుటకుగాను నలుగురితో ఒక ఉపసంఘాన్ని నియమించారు.

పంచవర్ష ప్రణాళిక అమలుకు మరో ముగ్గురితో ఒక ఉపసంఘాన్ని నియమించారు.

సత్వర కొరియా యుద్ధ విరమణ

చైనా - అమెరికాలకు ఇండియా అభ్యర్థన

న్యూఢిల్లీ, జూన్ 24

కొరియాలో ఏర్పడబోయే తటస్థ రాజ్యాల ఉపసంఘంలో భారత ప్రతినిధి పాల్గొనే విషయమూ, ఉపసంఘానికి సహాయకారిగా సైన్యాలను పంపే విషయమూ కొరియా యుద్ధ విరమణ సంధిపై ఆధారపడివుంటుందని ఇక్కడ అధికారవర్గాల్లో తెలియవస్తోంది.

ఈ వారాంతంలో ప్రధాని నెహ్రూ ఢిల్లీకి తిరిగి రాబోతున్నారు గనుక ఆయన వచ్చే లోపున ఇండియా ప్రభుత్వం ఈ సమస్యపై ఎలాంటి నిర్ణయం తీసుకోదని తెలుస్తోంది.

ఈ లోపున నిరంకుశంగా ఉత్తర కొరియన్ ఖైదీలను విడుదల చేసిన సింగ్మన్‌రీ దుశ్చర్యను దృష్టిలో వుంచుకుంటూ త్వరగా యుద్ధవిరమణ సంధిచేసుకోడానికి శక్తివంచనలేకుండా కృషిచేయవలసిందిగా చైనా- అమెరికా ప్రభుత్వాలను కోరుతూ ఇండియా విజ్ఞప్తులు పంపినట్లు తెలుస్తోంది.

కొరియా పరిస్థితిని గురించి చర్చించడానికి సాధ్యమైనంత త్వరలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీని సమావేశపరచాలని కూడా ఇండియా సూచించినట్లు తెలుస్తోంది.

స్వదేశానికి కాంబోడియా రాజు పునరాగమనం

ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని అరికట్టేందుకేనని వెల్లడి

సైగాన్, జూన్ 24

తనదేశంపై ఫ్రెంచివారి పెత్తనానికి నిరసనగా రాజ్య పరిత్యాగం చేసేస్తున్నానని సయాం వెళ్ళిపోయిన కాంబోడియా రాజు నరోదం, ఉన్నట్లుండి తనదేశానికి తిరిగివెళ్ళిపోవడానికి కారణాన్ని అతని ఉద్యోగుల్లో ఒకడు ఈవేళ బయటపెట్టాడు.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసం కాంబోడియా ప్రజలు సాయుధ తిరుగుబాటు ప్రారంభించే సూచనలు కనబడసారంభించాయనీ, గెరిల్లా పోరాటం ప్రారంభమవుతుందేమో అని నరోదమ్ రాజు ఆందోళన పడ్డాడనీ, అలాంటిదేమీ జరక్కుండా కట్టుదిట్టాలు చేసేందుకే ఆయన తనదేశానికి తిరిగివెళ్ళాడనీ ఈ ఉద్యోగి తెలిపాడు.

కాంబోడియా రాజధానిలో ఏదైనా తిరుగుబాటు ప్రారంభమయితే దానిని అణచివేసేందుకు ఫ్రెంచి ప్రభుత్వం అదనపు సేనలను అక్కడ సిద్ధంగా ఉంచింది.

పాకిస్తాన్‌లాంటి ప్రతిపత్తి కావాలట

బ్రిటిష్ కామన్వెల్తులో పాకిస్తాన్ దేశానికి ఎలాంటి ప్రతిపత్తి ఉన్నదో, కాంబోడియాకు ఫ్రెంచిసామ్రాజ్యంలో అలాంటి స్థానమే కావాలని నరోదమ్ రాజు ఒక ప్రకటన చేశాడు. అందుకు ఫ్రాన్సు ఒప్పుకుంటేసరి, లేకపోతే శాంతియుతంకానిఇతరపద్ధతులకు, పూనుకొని స్వాతంత్ర్యాన్ని సాధించవలసివుంటుందని ఆ ప్రకటనలో బెదిరించాడు.

“ఈ విషయం గురించి ఆలోచించి, సాధ్యమైనంత త్వరలోనే తగు చర్య తీసుకుంటామని ఫ్రెంచి ప్రభుత్వం ప్రస్తుతానికి ఒక వాగ్దానం ఇస్తేచాలు-తాను తొందరపడి ఏమీ చేయన”ని అతను ఫ్రెంచివారికి హామీ కూడా ఇచ్చాడు.

ట్రేడ్‌యూనియన్ సంస్థల విలీనం

డాంగే, మృణాల కాంతిబోస్ సమాలోచనలు

కలకత్తా, జూన్ 25

అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ యస్. ఏ. డాంగే, యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ మృణాల కాంతి బోస్ నేడిక్కడ శ్రీ బోస్ గృహంలో సమావేశమై రెండు సంస్థల సంలీనావకాశాలను గూర్చి సమాలోచనలు జరిపారు.

ఈ చర్చలు సుహృద్భావ పూరిత వాతావరణంలో జరిగాయని, కార్మిక వర్గసంస్థలను సాధ్యమైనంత బలవత్తరం చేయాలనే వాంఛ చర్చల్లో వ్యక్తమైందని [illegible] తెలిపారు.

అయితే ఉభయ సంస్థల వర్కింగ్ కమిటీలు, జనరల్ కౌన్సిల్సూ సంయుక్తంగా సమావేశమై ఈ సమస్యపై అంతిమ నిర్ణయాలు తీసుకోవలసి వుంటుంది. జూలై ఆఖరులో ఈ సమావేశాలు కలకత్తాలో జరగవచ్చు.

సాంబాల్‌పూర్, కటక్ జిల్లాలలో జరిగిన శాసనసభ ఉపఎన్నికలలో గణతంత్ర పరిషత్తు, ప్రజా సోషలిస్టు పార్టీల అభ్యర్థులు గెలుపొందారు.

వచ్చే 6 మాసాలకు దిగుమతి కోటాలు

నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 25

గడియారాలు, పాల డబ్బాలు వగైరా అత్యవసర వస్తువుల దిగుమతి కోటాలను ఈ సంవత్సరం రెండో భాగానికి నేడు ప్రభుత్వం ప్రకటించింది.

ఇదివరకు మనదేశానికి దిగుమతి చేసుకొంటున్న చాలా వస్తువుల కోటాలు యథాతథంగానే ఉంచబడినాయి. స్వదేశంలో తయారై దొరుకుతున్న కొద్దిపాటి వస్తువుల దిగుమతి కోటాలు మాత్రం తగ్గించబడినాయి. ఇనుమూ, ఉక్కుతో తయారు చేయబడే బోల్టులు, నట్టులూ, రివెట్లూ, రేకులు వగైరాలు, కుట్టు మిషన్లు ఇంకా మరికొన్ని వస్తువుల కోటా తగ్గించబడింది.

డీసెల్ ఇంజనులు, పెట్రోలు, కిరసిన్ ఇంజన్లు 50 హార్సుపవర్ గల మోటార్లు వగైరాల దిగుమతులు ఇప్పటివలె జూలై డిసెంబరుల మధ్య ఉండవు.

కాంగ్రెసుప్రభుత్వ ఉరికంబాలనుంచి శ్రీ యాదగిరి విమోచన

సాధారణ న్యాయపరీక్షకుకూడ నిలవని హైద్రాబాదు ప్రభుత్వారోపణలు

జనగామ, జూన్ 20

ఈ నెల 17 వ తేదీన జనగామ మాజిస్ట్రేట్ కోర్టు శ్రీ పైళ్ల యాదగిరిపై కాంగ్రెసు మిలిటరీ ప్రభుత్వం ఆరోపించిన హత్యానేరం నిరాధారం అని నిర్ణయించింది. ఆయనపై విధించిన ఉరిశిక్షను రద్దుపరచి, విడుదల చేసింది. ఆరు సంవత్సరాల జైలు నివాసం అనంతరం శ్రీ పైళ్ల యాదగిరి విడుదల అయ్యారు.

శ్రీ యాదగిరిది జనగామ తాలూకా కడవెండి గ్రామం కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు. రజాకారు మూకల నెదిర్చి తెలంగాణా ప్రజానీకానికి అండగా నిలబడిన నేరానికి నెహ్రూ ప్రభుత్వపు మిలిటరీ దళాలు ఈయనను 1948 ఆఖరున అరెస్టు చేశాయి. ఈయనను చిత్రహింసలకు గురిచేసి భువనగిరి మిలిటరీ కోర్టు ఈయనకు ఉరిశిక్ష విధించింది.

విసునూరు రామచంద్రారెడ్డి పంపిన గూండాని ఒకణ్ణి చంపారని ఈయనపై కాంగ్రెసు ప్రభుత్వపు ఆరోపణ. కేసులో వాదించుకోడానికిగాని, సాక్ష్యాలిప్పించడానికిగాని ఏ విధమైన అవకాశాలను ఇవ్వకుండా శ్రీ యాదగిరికి ఉరిశిక్ష వేశారు.

కాని, ఈఘోరాన్ని తెలంగాణా, ఆంధ్రప్రజానీకం తీవ్రంగా ప్రతిఘటించింది. తెలంగాణాలో కాంగ్రెసు తలపెట్టిన ఈహత్యలపై ప్రపంచ ప్రజాభిప్రాయమే దద్దరిల్లింది. చివరకు ప్రభుత్వము ఉరిశిక్షలను రద్దుపరచి యావజ్జీవ శిక్షలను చేసింది. ప్రజాందోళన ఫలితంగా ఆ కేసులను పునర్విచారణకు తేవలసివచ్చింది.

సింగ్మన్‌రీని సంజాయిషీ అడగాలని నిర్ణయం

దక్షిణ కొరియా అసెంబ్లీ తీర్మానం

సియోల్, జూన్ 24

ఐ. రా. సమితి అధికారాన్ని ధిక్కరించి, ఉత్తరకొరియా యుద్ధఖైదీలను విడుదల చేసినందుకు సింగ్మన్‌రీ ప్రభుత్వాన్ని సంజాయిషీ అడిగేందుకు దక్షిణకొరియా అసెంబ్లీ నిశ్చయించుకొంది. దక్షిణ కొరియా ప్రధానిని, విదేశాంగ, రక్షణశాఖ, వ్యవసాయశాఖమంత్రులను ముందు సంజాయిషీ అడిగారు.

ఇలా విడుదలచేసిన ఖైదీలను ప్రభుత్వం ఏమిచేయ దలచుకొందో అడగ దలచారు కూడా. ఈ ఖైదీలను గురించి ఏర్పడిన ప్రభుత్వకమిటీ అసెంబ్లీకి ఒక నివేదిక సమర్పించింది. గ్రామసీమల్లో రైతులు తక్కువయ్యారనీ, ఆ కొరతను తీర్చేందుకు ఈ ఖైదీలను పల్లెప్రాంతాలకు పంపుటకు ప్రభుత్వం నిశ్చయించిందనీ ఈనివేదిక తెలిపింది.

విడుదలయిన ఖైదీలను తమ సేనలో సమీకరించుకొనేందుకు నిశ్చయించుకున్నామని సింగ్మన్‌రీ ప్రభుత్వమే మొన్న మొన్న ఖచ్చితంగా ప్రకటించింది. ఆ ప్రకటనకూ ఇప్పటి నివేదికకూ గల పరస్పర వైరుధ్యం రాజకీయవర్గాలకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

“కమ్యూనిస్టు వ్యతిరేక” యుద్ధఖైదీలను విడుదల చేయాలని ఈ అసెంబ్లీయే లోగడ తీర్మానించింది. కాని, ఈ చర్యకు బాధ్యత అంతా సింగ్మన్‌రీ ఒక్కనిపైనే మోపేందుకు లోగడ ఆ చర్యను ప్రోత్సహించినవారంతా ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. అలాంటి ప్రయత్నమే ఇప్పుడీ అసెంబ్లీ చేస్తున్న పనికూడా అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

అసెంబ్లీలోని సింగ్మన్‌రీ అభిమానుల్లో ఒక ముఖ్యుడైన పే-ఉన్-హ్యూ అనే అతను, “అసెంబ్లీలో లోగడ మేమంతా చేసిన తీర్మానాన్ననుసరించే సింగ్మన్‌రీ ఈ చర్య తీసుకున్నప్పటికీ, ఐ. రా. సమితి అధికారాన్ని ధిక్కరించవలసి వస్తుందని మేము అనుకోలేదు,” అని అన్నాడు.

బ్రిటిష్ లేబరుపార్టీ ఖండన

లండన్, జూన్ 24

బ్రిటిష్ లేబరుపార్టీ కేంద్ర కార్యవర్గం, సింగ్మన్‌రీ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఒక ప్రకటన చేసింది:

“సింగ్మన్‌రీ, అతని పక్షంవారూ తలపెట్టిన ఘాతుక విచ్ఛిన్నకచర్య ఇది. కొరియాలో యుద్ధవిరమణకు దీనిని ప్రతిబంధకంగా పరిణమించనీయరాదు,” అని ఈ ప్రకటన తెలిపింది.

తూర్పు బెర్లిన్ ఘటనలకు సానుభూతి

తూర్పు బెర్లిన్‌లో ప్రజా ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తున్నవారి పట్ల గాఢ సానుభూతిని ఈ ప్రకటనలో తెలిపారు. తూర్పు జర్మనీ ప్రభుత్వంనుండి విముక్తిపొందేందుకు అక్కడి ప్రజలు తహతహలాడుతున్నారనేందుకు అక్కడి ఘటనలు నిదర్శనమన్నారు. జర్మనీనంతా ఏకంచేసి, దేశమంతటా ఎన్నికలు జరిపేందుకు తగిన చర్యలు పడమటి దేశాలవారు వెంటనే తీసుకోవాలన్నారు.

అంతర్జాతీయ పరిస్థితులు నానాటికీ మారుతున్నాయి కాబట్టి, తమభవిష్యత్ విదేశాంగ విధానాన్ని ఇప్పుడేమీ తేల్చుకోమన్నారు.

సింగ్మన్‌రీకి డల్లెస్ రహస్య లేఖ

టోకియో, జూన్ 24

సింగ్మన్‌రీకి డల్లెస్ వ్రాసిన రహస్య లేఖతో ఐసన్‌హోవర్ ప్రత్యేక ప్రతినిధిగా, అమెరికా విదేశాంగశాఖ సహాయ కార్యదర్శి వాల్టర్ రాబర్ట్‌సన్ నేడు టోకియో చేరుకున్నాడు. “అంతా చక్కబడుతుందనే ఆశ..” అని అతను విలేఖరులతో అన్నాడు.

అతను అమెరికా సర్వసేనాని జనరల్ మార్కు క్లార్కుతోను, తదితర అమెరికన్ ప్రతినిధులతోను చర్చించి రేపు కొరియా వెళ్ళి సింగ్మన్‌రీని కలుసుకుంటాడు.

కాశ్మీర్ కళా నిలయంపై దాడి

జమ్మూలో దుస్సంఘటన

జమ్మూ, జూన్ 24

ఈవేళ ఉదయం కొంతమంది ఒక గుంపుగావచ్చి కాశ్మీర్ ప్రభుత్వకళానిలయంపై దాడిచేసి షోకేసుల్లోఉన్న వస్తువులను ధ్వంసం చేశారు.

కిటికీల తలుపులను బద్దలుకొట్టి లోపలికివచ్చి అక్కడి అధికారులను వారు చేయిచేసుకొన్నారుకూడా.

పట్టణంలో కొన్నిచోట్ల పోలీసులకు ప్రజలకు కొద్దిపాటి ఘర్షణలు జరిగాయి. డాక్టర్ శ్యామప్రసాద్ మరణానికి విచారసూచకంగా దుకాణాలు కట్టేసి హర్తాలు చేయవలసిందిగా కోరుతూ విద్యార్థులు బజారులలో తిరిగారు.

3 ఏళ్లలో సుమారు 10 లక్షల ఐ. రా. సైనికుల నష్టం

టోకియో, జూన్ 25

కొరియా యుద్ధం ప్రారంభమయి మూడేళ్ళు పూర్తి అయ్యాయి. నేటి నుండి నాలుగోయేడు ప్రారంభమవుతుంది.

గత మూడేళ్ళలో 9,89,391 మంది ఐ. రా. సమితి సైనికులు (అమెరికా, బ్రిటన్ మొదలయిన దేశాలవారు) చనిపోవడమూ, గాయపడడమూ ఖైదీలు కావడమూ జరిగిందని ప్యాంగ్యాంగ్ రేడియో ప్రకటించింది.

‘న్యూజెర్సీ’ అనే 50,000 టన్నుల అమెరికా యుద్ధనావ ఉత్తర కొరియాలోని వాన్సాన్ నౌకాశ్రయంవద్ద నిన్న తీవ్రంగా [illegible].

ఆంధ్ర అకౌంటెంట్ జనరల్ ఆఫీసు

స్థాపన సమస్యపై శ్రీ నరహరిరావు పరిశీలన

మద్రాసు, జూన్ 25

మద్రాసు రాష్ట్ర ఆస్తి అప్పుల విభజనను గురించి తానింకా ప్రభుత్వంతో చర్చించలేదని ఇండియా ఆడిటర్ జనరల్ శ్రీ వి. నరహరిరావు గారు నిన్న ఇక్కడ విలేఖరులతో చెప్పారు. తాను ప్రధానంగా ఆంధ్ర రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ కార్యాలయ స్థాపనను గురించి పరిశీలిస్తున్నానన్నారు.

ఈ విషయమై తాను డిపార్టుమెంటు ఉద్యోగులతో చర్చిస్తున్నానని నరహరిరావుగారు చెప్పారు.

ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకంగా పోస్టల్, రైల్వే ఆడిట్ అవసరం లేదన్నారు. (పి. టి.)

బళ్లారి ప్రముఖులకు ప్రభుత్వ తాఖీదులు

సత్ప్రవర్తనకు హామీ ఇవ్వాలని కోరుతూ

బళ్లారి, జూన్ 24

బళ్లారి నియోజకవర్గంనుండి ఎన్నికైన శాసన సభ్యుడు శ్రీ [illegible] గంగప్పగారితోపాటు మరి ఏడుమంది స్థానిక పురప్రముఖులకు క్రిమినల్ ప్రొసీజరు కోడు 117వ సెక్షన్ క్రింద సత్ప్రవర్తనకుగాను పూచీకత్తులు కోరుతూ ప్రభుత్వం నేటిరాత్రి నోటీసులు జారీచేసింది.

ఆ విధంగా నోటీసులు జారీకాబడిన వారిలో మరికొందరిపేర్లు ఇవి: శ్రీ దొడ్డ బసప్ప (బళ్లారి మున్సిపల్ చైర్మన్), శ్రీ రాజగోపాలశెట్టి (బళ్లారి ఆంధ్ర సమితి నాయకులు), శ్రీ దాసన్ సాలమన్, శ్రీ యం. ఏ. ఖాన్, శ్రీ టి. అమృతరావుగార్లు.

“పార్లమెంటరీ వ్యవహార దక్షుడు”

శ్యామప్రసాద్ మృతికి సుందరయ్యగారి సంతాపం

న్యూఢిల్లీ, జూన్ 24

డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ పార్లమెంటరీ వ్యవహార దక్షుడు. ప్రభుత్వం అనుసరించుతుండే అనేక విధానాలను ఆయన చాల తీవ్రంగా విమర్శించుతూ వుండేవారు అని ఈవేళ పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ సుందరయ్యగారు డాక్టర్ ముఖర్జీ మృతికి తన విచారాన్ని తెలుపుతూ అన్నారు.

శ్రీ సుందరయ్యగారు ఇంకా ఇలా అన్నారు:

ఈవేళ ఉదయం నేను ఢిల్లీకి చేరగానే డాక్టర్ శ్యామప్రసాద్ కాశ్మీర్‌లో డిటెన్షన్‌లో ఉండగా గుండెజబ్బుతో అకస్మాత్తుగా మరణించారన్న విచారకరమైన వార్త తెలిసింది. రాజకీయ వ్యవహారాలలో మాకు ఎంతగానో విభేదాలున్నప్పటికీ దేశంలోని ఒక గొప్ప పార్లమెంటరీ వ్యవహార దక్షుణ్ణి, ప్రభుత్వ విధానాల తీవ్ర విమర్శకుణ్ణి కోల్పోయామని విచారపడుతున్నాం. ఆయన కుటుంబానికి మా సానుభూతి తెలియజేస్తున్నాం.

గోపాలన్ సంతాప సందేశం

ఎర్నాకులం, జూన్ 24

ప్రజాసభలో కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ డాక్టర్ ముఖర్జీమృతికి తన సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి ఒక సానుభూతి సందేశాన్ని నేడు పంపించారు.

శ్రీ గోపాలన్ ఈ సందర్భంలో వేరొక ప్రకటన చేస్తూ మేమంతా పార్లమెంటులో ప్రతిపక్షంగా ఉండి ఐక్యతతో కొన్ని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన రోజులు ఈనాడు జ్ఞప్తికి వస్తున్నాయన్నారు. డాక్టర్ ముఖర్జీ మరణం ప్రతిపక్షానికి ఎంతో నష్టమన్నారు.

వాగన్ల కొరత వలన దేశంలో బొగ్గు సరఫరా కష్టంగా వున్నదని కేంద్రఉత్పత్తిశాఖ మంత్రి శ్రీ కె చంగల్రాయరెడ్డి మైసూర్‌లో అన్నారు.

◆ ◆ ◆

కాశ్మీర్ ఒక జాతి అని షేక్ అబ్దుల్లా అన్నాడని బాబు పురుషోత్తమదాస్ టాండన్ ఆగ్రహం ప్రకటించారు.

తమిళ కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుపై అక్రమదాడి

ఆంధ్రకమ్యూనిస్టుకమిటీ కార్యవర్గ ఖండన

విజయవాడ, జూన్ 25

మద్రాసులో తమిళనాడు కమ్యూనిస్టుకమిటీ కార్యాలయంపై ప్రభుత్వం అక్రమంగా దాడి చేయడాన్ని ఖండించుతూ, అరెస్టుచేయబడిన వారందరినీ తక్షణం విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రకమ్యూనిస్టుకమిటీ సెక్రటేరియట్ నేడొక ప్రకటన చేసింది.

ఆ ప్రకటనలో ఇలా వుంది:

రోజెన్‌బర్గ దంపతుల హత్యపట్ల నిరసన తెలుపుతూ అమెరికన్ కాన్సలేట్ కార్యాలయంముందు మూడు వందలమంది మద్రాసు పౌరులు ప్రదర్శనలు జరిపారు. అమెరికన్ అణు శాస్త్రవేత్తలను చట్టం చాటున హత్యచేసిన అమెరికన్ ప్రభుత్వ చర్యను ప్రపంచమంతా ఖండించింది. అమెరికా ప్రభుత్వం జరిపిన ఈ ఘాతుక చర్యను ఖండించడానికి బదులు, మద్రాసు ప్రభుత్వం ప్రదర్శకులపై పోలీసులను ఉపయోగించి ప్రజలను చెదరగొట్టింది.

అంతేగాక తమిళనాడు పార్టీ ఆఫీసుపై అర్ధరాత్రివేళ సోదా వారంటైనా లేకుండా దాడిచేసి ఆఫీసులోనున్న 22 మందిని అన్యాయంగా అరెస్టు చేసింది. ఆఫీసు బీరువాలను, రికార్డులను చెదరగొట్టి ఆఫీసు రికార్డు పట్టుకుపోయారు. అరెస్టు చేసిన వారిపై దొమ్మీ కేసు కూడా పెడతారని తెలుస్తోంది.

మద్రాసురాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీపై దెబ్బకొట్టాలనే కసితో, కనీస ప్రజాస్వామిక సూత్రాలను కూడా ఉల్లంఘించి, ఏలాంటి వారంటు లేకుండా, అక్రమదాడి చేయడాన్ని ఆంధ్ర కమ్యూనిస్టుకమిటీ సెక్రటేరియట్ తీవ్రంగా ఖండించుతోంది. అరెస్టుచేసిన వారినందరినీ తక్షణం విడుదలచేయమని ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ కోరుతోంది.

రాష్ట్రంలోని ప్రజాస్వామికవాదులంతా ఈ దాడిని ఖండించవలసిందిగా ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ విజ్ఞప్తి చేస్తోంది.

" భావప్రకటనా స్వాతంత్ర్యం
మన జన్మహక్కు. దానికి
రాజ్యాంగం సంపూర్ణంగా
అభయమిచ్చే వరకు
విశ్రమించము "

విశాలాంధ్ర

26-6-53 శుక్రవారం

చౌకడిపోలు

మద్రాసు ప్రభుత్వం చౌకడిపోలలో బియ్యం రేషనును 4 ఔన్సులు, 6 ఔన్సులు నిర్ణయిస్తూ 22వ తేదీన ఒక ప్రకటన చేసింది. వాస్తవ పరిస్థితి చూస్తున్నవారికి యీ నిర్ణయం హాస్యాస్పదంగా ఉంటుంది.

ధాన్యపు గిడ్డంగులుగా పేరు మోసిన ప్రాంతాల్లోనే ధరలు విపరీతంగా పెరిగి పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిన్నటి రోజుల్లో మద్రాసు ప్రభుత్వం - కేవలం కంట్రోళ్లు ఎత్తివేయుటమే గాదు- పేదలకు ధాన్యం అందించవలసిన బాధ్యత నుండే చేతులు కడుక్కొని కూర్చున్నది. నామకా చౌకడిపోలు తెరుస్తామన్నప్పటికి ఆ డిపోలు తెరిచిందే కొద్ది గ్రామాల్లో. అవికూడా మళ్లీ 1, 2 మాసాల్లోనే మూసివేయబడ్డాయి. పేరుకు చౌకడిపోలేగాని ధరలో కాదని ఆచరణ రుజువు చేసింది. దొంగ మార్కెటు రేటు కంటె, కంట్రోలు రేటు కంటె గూడా బజారులో బియ్యం ధర తగ్గుతుందని గత సంవత్సరం జూన్‌లో బుకాయించింది ప్రభుత్వం. లింగాన్ని, గుడిని మొత్తంగా మ్రింగినట్లు ఈ సంవత్సరకాలంలో ధాన్యం ధరలు అదివరకు కంట్రోలు రేటును, దొంగ మార్కెటు రేటును మ్రింగి కూర్చున్నాయనే విషయం జగద్విదితం. చివరకు మాసూలు రోజుల్లో కక్కుర్తి కొరకు సామాన్య రైతులు తక్కువ ధరలకు అమ్మినధాన్యం కూడా భూస్వాములకు, మిల్లు యజమానులకే దక్కింది గాని ప్రజలకు కాదనే విషయంకూడా అందరికి తెలిసినదే. నేడు మళ్ళీ ధరలు చుక్కలుచూస్తున్నాయి. బస్తా ధాన్యం రు. 32 - 33 లు అమ్ముతూన్నది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, పేద రైతులు అనేక వృత్తుల్లో వుండే యితర పేదలు, పట్టణాల్లోని కార్మికులు, మధ్యతరగతులవారు తమ కందకుండా మిన్నంటుతున్న ధరలను చూచి, క్రుంగి పోతున్న తమ జీవితాలను చూచీ గాభరా పడుతున్నారు. తీవ్రాందోళన చెందుతున్నారు.

దొంగమార్కెటుకు మించిన అధికధరలను చట్ట సమ్మతం చేసి తనకేమీ పట్టనట్లు కూర్చోవటం ప్రభుత్వానికి తగని పని. పేదలబాధల్ని వినిపించుకోకుండా ఉష్ట్రపక్షిలా నేలలోకి తల దూర్చి కూర్చోవటం భావ్యం గాదు; బాధ్యత అనిపించుకోదు. అక్కడక్కడా మొక్కుబడిగా చౌకడిపోలు తెరవటం, రెండు ఔన్సులు, నాలుగు ఔన్సులు యిస్తామని ప్రకటనలు చేయటం ప్రజల కోర్కెల్ని మన్నించటం గాదు, తృణీకరించటమే.

ప్రభుత్వం బాధ్యతెరిగి మెలగాలి. ప్రజల ఆందోళనను గుర్తించి గ్రామాల్లోను పట్టణాల్లోను సివిల్ సప్లయిసు కమీషనరుగారి యిష్టా నిష్టాలకు వదలివేయకుండా చౌకడిపోలను వెంటనే తెరవాలి. లెవీగా వసూలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా సప్లయిచేసి, ఖర్చులు వేసుకొని సరసమైన ధరలకు అమ్మాలి. ధాన్యం ఏ మాత్రం నిల్వలేని కుటుంబాల సంఖ్యను బట్టి వారికి అవసరమైన పూర్తి రేషను బియ్యం డిపోల్లో యివ్వాలి. ప్రభుత్వం ఈ బాధ్యతను స్వీకరించినప్పుడే ధాన్యానికి మార్కెటు ధరలు తగ్గుతాయని గమనించాలి.

వ్యాఖ్యలు-విమర్శలు

విద్రోహపూరిత తీర్పు వ్యతిరేకంగా బళ్ళారి ఆంధ్రులు సాగిస్తున్న సత్యాగ్రహోద్యమ సందర్భంలో పోలీసు అధికారులు [illegible] పురప్రముఖులనుంచి సత్ప్రవర్తనకు హామీపత్రాలివ్వమని కోరడం అగ్నిలో ఆజ్యం పోయడమే కాగలదు.

ఇండియా ప్రభుత్వం బహుభాషా ప్రాంతమైన బళ్ళారి తాలూకా భవిష్యత్తును సరిహద్దు కమిషన్ నిర్ణయానికి వదలకుండా ఒక వ్యక్తియొక్క అభిప్రాయానికి వదలడంలోనే అసలు కుట్ర అంతా ఉంది. దానికి తోడు మిశ్రా తీర్పుపట్ల నిరసనగా ప్రారంభింపబడిన సత్యాగ్రహోద్యమంలో పాల్గొంటున్న వారిపై పోలీసులు జరుపుతున్న అత్యాచారాలు బళ్ళారి ఆంధ్రులను క్రోధావేశుల్ని చేస్తున్నాయి. ఇప్పుడు 144 వ సెక్షన్‌ను ధిక్కరించిన పైన పుర ప్రముఖులపై "శాంతి"కి భంగం కలగజేస్తారనే ఆరోపణ తెచ్చి పోలీసులు పూచీకత్తు లడగడం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. బళ్ళారిలో ఉద్రిక్త వాతావరణానికి కారకులైన కాంగ్రెసు పాలకవర్గపు కుటిల నీతిని, మద్రాసు ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్బంధవిధానాన్ని ఆంధ్ర ప్రజాస్వామ్యవాదు లందరూ నిరసిస్తున్నారు.

◆ ◆ ◆

బళ్ళారి సమస్యపై ప్రజా సోషలిస్టు పార్టీ వైఖరిని వివరిస్తూ విజయనగరం రాజాగారు చేసిన ప్రకటనకు జవాబుగా ప్రకాశం పంతులుగారు చేసిన వ్యాఖ్యానం అసలు సమస్యకు పరిష్కారమార్గం చూపకపోగా, మరింత ఉద్రిక్త పరిస్థితికి కారణ మవుతోంది.

అన్నదమ్ములవలె మెలగవలసిన ఆంధ్ర కన్నడుల మధ్య వైషమ్యాలు పెంచదలచుకున్న కేంద్ర ప్రభుత్వపు కుటిలనీతిని ప్రజా సోషలిస్టు నాయకు లెరుగకపోవడం లేదు. సరిహద్దు కమిషన్ ద్వారాగాని, రిఫరెండం ద్వారాగాని యీ సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేయడం ప్రజాస్వామ్య వాదులందరి కర్తవ్యం. ఆంధ్ర - కన్నడుల మధ్య తిరిగి సామరస్యం నెలకొనాలంటే, యీ నినాదం మీద ప్రజలందరినీ సమీకరించాలి. కాని, ప్రకాశంపంతులుగారి వ్యాఖ్యానము యిందుకు పూర్తిగా విరుద్ధం.

బళ్ళారి ఆంధ్రుల అసంతృప్తిని స్వప్రయోజనపరులు ఒక పాచికగా వినియోగించుకొంటున్నారనే విషయాన్ని ఆంధ్రప్రజలు అర్థం చేసుకోకపోరు.

◆ ◆ ◆

"ఆకలిచావుల వార్తలు కేవలం ప్రచారం కొరకు కల్పింపబడుతున్నాయి. అలా చనిపోయారని ప్రచురింపబడిన వ్యక్తుల ఫోటోలు కట్టి అబద్ధం," అంటూ మంత్రి రంగారెడ్డి కడపజిల్లాలో పర్యటిస్తూ ముచ్చటించారు.

ఆకలిబాధ యెలా ఉంటుందో ఎరుగని కాంగ్రెసు మంత్రులు ఆకలిచావుల వార్తలు అబద్ధాలని ఖండించడం ఆశ్చర్యం కాదు. కాని కరువు రాక్షసి కాంగ్రెసు మంత్రుల ఆజ్ఞలను గాని, ఖండనలను గాని ఖాతరుచేయడం లేదు! ఆకలి చావుల సంఖ్య రోజురోజుకు హెచ్చుతోంది; కాంగ్రెసు పాలకుల ప్రతిష్ట రోజు రోజుకు పతన మవుతోంది.

◆ ◆ ◆

తిండి గింజలకోసం అలమటించే ప్రజలమీద తుపాకులు కాల్చే పద్ధతి కాంగ్రెసు పాలనలో సర్వసామాన్యమైన విషయంగా తయారయింది.

మద్రాసువద్ద తండియార్పేట రైల్వే మార్షలింగ్ యార్డులో గోధుమ బస్తాలతో నిండియున్న రైలు వ్యాగన్‌లపై ఆకలిగొన్న ప్రజలు దాడి చేశారనీ, సాయుధ పోలీసులు వారిపైతుపాకులు కాల్చిన ఫలితంగా ఒక వ్యక్తి చనిపోయాడని వార్త. పోలీసుల చర్యను సమర్థించడానికా అన్నట్లు "ఆత్మరక్షణ"కోసం వారు కాల్పులు సాగించవలసి వచ్చిందని చెప్పబడుతోంది.

ప్రజలకు తిండి పెట్టవలసినబాధ్యత కాంగ్రెసు మంత్రులపై ఉండగా, ఈ బాధ్యతను వారు తీసుకోకుండా ప్రజలను కరువు రాక్షసికి ఆహుతిచేయడం ఒక యెత్తు; తిండిలేక అల్లాడే ప్రజలపై తుపాకులు కాల్చి చంపడం మరొక యెత్తు. ఇట్టి అమానుష చర్యల ద్వారా ప్రజల చైతన్యాన్ని అణచగల మనుకోవడం వట్టి భ్రమ.

◆ ◆ ◆

జనగాం మేజిస్ట్రేటు కోర్టులో శ్రీ వైశ్య యాదగిరిపై కాంగ్రెసు ప్రభుత్వం ఆరోపించిన హత్యానేరం నిరాధారమని రుజువైనందున ఆయనపై విధింపబడిన ఉరిశిక్ష రద్దుచేయబడింది. శ్రీ యాదగిరి 6 సంవత్సరాల తరువాత జైలునుంచి విడుదల చేయబడ్డారు.

దీన్నిబట్టి, తెలంగాణా ప్రజాసేవకులపై పెట్టిన ఆరోపణలు మామూలు న్యాయశాస్త్రపు పరీక్షకుకూడా ఎలా నిలవలేక కూలిపోతున్నాయో తెలుసుకోవచ్చు. 1948-52 మధ్య తెలంగాణాలో ఎంతనిరాధారమైన అసత్య ఆరోపణలు కాంగ్రెసు ప్రభుత్వంచే చేయబడ్డాయో, ప్రజల ప్రాణాలకు ఎంతవిలువ ఈయబడిందో చెప్పడానికి యింతకన్న వేరే సాక్ష్యం అవసరం లేదు.

మద్రాసులో మరో 13 గురి అరెస్టు

అమెరికన్ కాన్సలేట్ ఎదుట ప్రదర్శనం సందర్భంలో

మద్రాసు, జూన్ 24

22 వ తేదీ సాయంకాలం అమెరికన్ కాన్సలేట్ కార్యాలయం ముందు జరిగిన ప్రదర్శన సందర్భంలో యివాళ మరి 13 గురు అరెస్టు చేయబడ్డారు. యిప్పటికి మొత్తం 35 మంది అరెస్టు చేయబడ్డారు.

ఈ ప్రదర్శనకు కారకుడని చెప్పి పోలీసులు నిన్నటినుండీ గాలించుతున్న మద్రాసు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఎ. ఎస్. కె. అయ్యంగారు యివాళ అరెస్టు చేయబడ్డారు.

నిన్న అరెస్టు చేయబడ్డవారికి బెయిలు కోరడానికిగాను ఎ. ఎస్. కె. అయ్యంగార్ ఇవాళ ఉదయం 11 గంటలకు పోలీసు కమీషనర్ ఆఫీసుకు ఆ సందర్భంలోనే పత్రికలలో తమ కొరకు పోలీసులు గాలించుతున్నట్లు ప్రకటించబడ్డదనీ, తమకొరకు ఎందుకు గాలించాలని అడిగారట. పోలీసులు 'మీరు అవసరమని చెప్పి' అయ్యంగారును అరెస్టుచేసి కస్టడీలో వుంచారు.

నిన్న సాయంత్రం, ఇవాళ అరెస్టు చేయబడ్డవారిలో 12 మంది ట్రాము కార్మికులు. వీరికి మొన్న జరిగిన ప్రదర్శనకు ఎటువంటి సంబంధంలేదు. వీరు నిరుద్యోగంతో బాధపడుతున్నారు.

ఇవాళ నిన్న అరెస్టు చేయబడ్డ ట్రాము కార్మికులలో ట్రాము వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ యస్. విజయరాజ్, కార్యదర్శి యం. కె. రంగనాథన్, సహాయకార్యదర్శి యస్. కె. శ్రీరాములు యింకా 10 మంది ట్రాము కార్మికులు ఉన్నారు.

మొన్నరాత్రి అరెస్టుచేయబడ్డ 22 మంది జామీనుమీద విడుదల చేయబడ్డట్లుగా కొన్ని పత్రికలలో పడ్డవార్త నిజం కాదు. వారు గాని, నిన్న ఇవాళ అరెస్టుచేయబడ్డవారు గాని జామీను మీద యివాళ మధ్యాహ్నం 3 గంటల వరకు విడుదలచేయబడలేదు. జామీను కొరకు ప్రయత్నాలు జరుగుతున్నవి. ట్రాము కార్మికులు ఒక్కొక్కరు 500 రూపాయల పూచీకత్తులు రెండేసి యివ్వాలనీ పోలీసు అధికారు లంటున్నారు.

నిరుద్యోగులైన యీ కార్మికులకు ప్రావిడెంటుఫండు తప్ప మరో ఆస్తి లేదు. పోలీసుఅధికారులు ప్రావిడెంటు ఫండును హామీగా తీసుకోడానికి అంగీకరించడంలేదు. (వి. వి.)

బ్రిటిష్ అటంఆయుధ పరీక్ష

ఆస్ట్రేలియాలో జరుగుతుందట

కానబెర్రా, జూన్ 24

ఆస్ట్రేలియా ఎడారిలో త్వరలోనే బ్రిటిషువారు మరొక అటం ఆయుధ ప్రయోగాలను, పరిశోధనకొరకు జరుపుతారని, ఆస్ట్రేలియా తాత్కాలిక ప్రధాని ఫేడు ప్రకటించాడు. ఈ ప్రయోగం ఎప్పుడు జరుగుతుందో తేదీ బయటపెట్టలేదు.

బ్రిటిష్‌వారు నేలమీద ఈ ప్రయోగం చేయడం ఇదే మొదటిసారి అనీ, ఇందులో ఆస్ట్రేలియాకూడా పాల్గొంటుందనీ తెలిపాడు.

కంచు కాగడా

"ప్రజాస్వామిక పరిమళం"

"రాజధాని నిర్ణయంలో ఆంధ్ర ప్రజాస్వామికవర్గాల విజయము సాధించాము." అంటూ మొన్న సంజీవరెడ్డిగారొక ప్రకటన చేశారు.

ఈ మధ్య ఆంధ్రదేశాన "ప్రజాస్వామిక పక్షాలం"టూ అవతరించాయి. ఈ ప్రజాస్వామికాన్ని గుత్తకు పుచ్చుకున్న పక్షాలవారు కాంగ్రెసు, కృషికార్ లోక్, ప్రజాసోషలిస్టుపార్టీలు. వీని గుత్త అధికారాన్ని చలామణిచేసి ప్రచారంలో పెడుతున్నవి కొన్ని సమకాలీన తెలుగు పత్రికలు.

పోనీయండి పదంమీద పోట్లాట మాని సరుకు వాణ్యమేమైనా వుందేమో పరిశీలిద్దాం. కాంగ్రెసు మార్కు "ప్రజాస్వామికం" ఘనత చెప్పతరమే గాదు. అయిదేళ్లు దీన్ని రుచి చూచిన ప్రజలు కాంగ్రెసు అతిరథుల్ని, మహారథుల్ని ఓడించి పూడుకున్నారు. ప్రజలకు "ప్రజాస్వామికం" నేర్పదలచిన వారు పూడుకుంటారా మరి! నామినేటుచేసి ఒకాయన్ని ముఖ్యమంత్రిని చేశారు. చిత్తుగా ఓడిపోయిన మరొక నేతను ఆంధ్ర కాంగ్రెసు అసెంబ్లీపార్టీ నాయకుణ్ణి చేశారు.

'అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న'అన్నట్లు "ప్రజాస్వామికం"లో ఘనత రంగాచార్లుగారి పార్టీకి యివ్వక తప్పదు. అది వరకు ఆంధ్రదేశంలో రజాకార్లను మరిపించిన ఘనకీర్తి ప్రస్తుతానికి వదిలివేయండి. ఎన్నికలయింతరువాతనో! ఓట్లనాడు కాంగ్రెసుకు వ్యతిరేకం. మరునాటి నుంచి 'ప్రజాస్వామికోద్ధరణ' కొరకు కాంగ్రెసుతో అనురూప సహకారం. అసెంబ్లీ దాటితే మాటలు కోటలు దాటుతాయి. చేతలు మాత్రం అసెంబ్లీలో రాజగోపాలాచారి గీసిన గీటు దాటవు. ఏమైనా మంత్రి పదవులు మ్రాని పండ్లుగానే ఉండిపోయాయి. పండు రాలిపడాలంటే ప్రజలతో నిమిత్తము ఏమిటి? - కాంగ్రెసుతోనే కలిస్తే సరిపోతుందని నూటిగానే కలిసిపోయారు.

కణుతికెక్కిన మరొక "ప్రజాస్వామిక"పార్టీ ప్రజాసోషలిస్టుపార్టీ. ఇందు రెండు తెగలు. ఎన్నికల నాడు ఒకటి [illegible] ప్రజాపార్టీ, మరొకటి సోషలిస్టుపార్టీ: ఈనాడు రెండూ కలిసి ప్రజాసోషలిస్టుపార్టీ. ఆనాడు కాంగ్రెసు వ్యతిరేకం, ఈనాడు కాంగ్రెసు అనుకూలం.

'మహాత్తరమైన' యీ మూడుపార్టీలు కలిస్తే "ప్రజాస్వామిక" పక్షాలైనాయి.

"ప్రజాస్వామికం" తెలియని ఆంధ్రులకు రాష్ట్రం రావటం ప్రమాదమని ఎవరికి చేతనైనంతగా వారు అడ్డం పడ్డారు. అయినను 'పిచ్చిజనం' వాంఛను రప్పించుకొన్నారు.

"ప్రజాస్వామిక పక్షాలు" మూడూ వాంగ్మూలాలు మెమొరాండంలు ఇచ్చాయి. కాని జనానికి చెబితే ప్రజాస్వామికం రాణించదని ప్రజలకు ఏమాత్రం తెలియకుండా వాటిని దాచిపెట్టివుంచారు. అసలు మన కాంగ్రెసు నాయకులకు "ప్రజాస్వామికం" ఉగ్గుపాలతో రంగరించి పోసినవాళ్లు బ్రిటిషువాళ్ళు: అందుకే వాళ్ళను మరపించి నూతనాంధ్ర గవర్నరుపాలనతో ప్రారంభం కావాలని కాంగ్రెసన్నయ్యలు కోరారు.

రాజధాని నిర్ణయంతో మనవాళ్ళ ప్రజాస్వామికం పరాకాష్ట పొందింది. ప్రజలకోసం రాజధానా - పదవుల కోసం రాజధానా అనే సమస్య ఎదుర్కొన్నది పాపం వాళ్ళను. ప్రజల కోసం కంటె పదవులకోసం రాజధానిని నిర్ణయించటం ఉత్తమ ప్రజాస్వామికమని వాళ్ళ అంతరాత్మ ఎవ్వరికీ తెలియకుండా హఠాత్తుగా జూన్ 1 వ తేది ఉదయం బోధించింది.

పదవుల వేటకు సావకాశమిచ్చేదే ప్రజాస్వామికం. ఈ ప్రజాస్వామిక పరిమళంతో ఆంధ్రదేశం గబ్బెత్తి పోతేనేం! మనవాళ్ళ ప్రతిష్ట మరొక్కసారి మొక్కపోతుందా!

ఎవరెస్టు శిఖరాగ్రాన్ని ఎవరు ముందెక్కారు?

తానూ, హిల్లరీ ఒకేసారి చేరినట్లు టెన్సింగ్ చేస్తున్న ప్రకటన

కలకత్తా, జూన్ 24

తానూ, హిల్లరీ దాదాపు ఒకేసారి ఎవరెస్టు శిఖరాగ్రాన్ని చేరుకున్నామని షర్పా టెన్సింగ్ నేడిక్కడ స్పష్టం చేశాడు. ఈవిషయంలో ఇక వివాదం అవసరం లేదనికూడా ఆయన ప్రకటించాడు.

ఇక్కడ రాజభవనంలో పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ టెన్సింగ్ (1) ఎవరెస్టు అగ్రాన్ని ఎవరు ముందు చేరుకున్నారు, (2) తన జాతి, (3) ఇంగ్లండుకు ప్రయాణాన్ని ఎందుకు వాయిదా వేసుకోవలసి వచ్చింది? అనే విషయాలపై వాగ్వివాదాన్ని అంతం చేయదలచానని చెప్పాడు.

మీరు భారతీయులా అని టెన్సింగ్‌ను మొదటి ప్రశ్న వేశారు. "అవును" అని ఆయన సమాధాన మిచ్చాడు. "నేను నేపాల్ జిల్లాలో తామి గ్రామంలో పుట్టాను. తర్వాత డార్జిలింగ్ వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నాను. అక్కడే పెండ్లి చేసుకున్నాను. నేపాల్‌లో పుట్టినందువల్ల నేపాల్ దేశంపైన, ప్రజలపైన, నాకు అభిమానం వుంది"అని తెలిపాడు.

కర్నల్ హంట్‌తో వాగ్వాదంవల్ల ఇంగ్లండుకు వెళ్ళడంలేదన్నమాట నిజమేనా అని అడగ్గా ఇలా అన్నాడు:

"నేను ఇంగ్లండుకు ఆహ్వానాన్ని నిరాకరించలేదు. కర్నల్ హంట్ కార్యక్రమం ప్రకారం జూలై 1 న నేను వారితోపాటు ఇంగ్లండు వెళ్ళాలి. అయితే ఢిల్లీలో నా ప్రోగ్రాం ముగిసిన మీదట డార్జిలింగ్ వెళ్లదలచాను. అందుచేత జూలై 1న ఇంగ్లండు వెళ్ళడానికి నాకు వ్యవధి ఉండదు. అయితే జూలై 1 తర్వాత కూడా ఆ ఆహ్వానం అలాగే వుంటే, ఇంగ్లండుకు సంతోషంగా వెడతాను."

ఎలిజబెత్ రాణి బహూకరించ దలచిన జార్జి పతకాన్ని నిరాకరించారా అన్న ప్రశ్నకు జవాబుకోసం ఒత్తిడి చేయవలదని టెన్సింగ్ కార్యదర్శి విలేఖరులను అభ్యర్థించాడు.

మరొక ప్రశ్నకు జవాబు చెబుతూ కర్నల్ హంట్ బృందంతో తన సంబంధాలు సరిగానే వున్నవని టెన్సింగ్ తెలిపాడు. "వారిని నా సోదరులుగా భావిస్తాను. మా సంబంధాలు చెడిపోయినవన్న వార్త సరికాదు" అన్నాడు. అయితే మీరు కలకత్తాకు ఒంటరిగా ఏల వచ్చారు? అని అడగగా నేపాల్ రాజు తన స్వంత విమానాన్ని ఇచ్చాడని అందుకని వచ్చానని తెలిపాడు.

ఎవరెస్టు శిఖరాన్ని ఎవరు ముందు ఎక్కారు అన్న ప్రశ్నకు సమాధానంగా తాను, హిల్లరీ, ఖాట్మండులో చేసిన ప్రకటనలను టెన్సింగ్ చదివి వినిపించాడు. అధిరోహణ ఆఖరుదశలో తాను, హిల్లరీ, ముందు, వెనుకలుగా వెళ్లామని శిఖరాగ్రాన్ని దాదాపు ఒకేసారి చేరుకొన్నామని టెన్సింగ్ ప్రకటనలో వుంది. అలాగే తామిద్దరం దాదాపు ఒకేసారి శిఖరాగ్రం చేరుకొన్నామని హిల్లరీ జూన్ 22 న చేసిన ప్రకటనలో వుంది. ఈ ప్రకటనలు చదివి, వీటిపై ఇక వివాదం ముగించాలని టెన్సింగ్ విజ్ఞప్తి చేశాడు.

"అభిప్రాయ భేదం లేదు"

కర్నల్ హంట్ వివరణ

పాట్నా, జూన్ 24

ఎవరెస్టు శిఖరాగ్రాన్ని ముందు చేరుకున్నది ఎవరు అనే విషయంలో తనకూ టెన్సింగ్‌కూ అభిప్రాయభేదం లేదని జట్టు నాయకుడు, కర్నల్ హంట్ నేడిక్కడ విలేఖరులతో చెప్పాడు. "టెన్సింగ్ కూడా ఇలాగే మీకూ చెప్పగలడు" అన్నాడు.

ఖాట్మండూనుంచి కలకత్తాకు వెళుతూ దారిలో విమానాశ్రయంలో కర్నల్ హంట్ విలేఖరులతో మాట్లాడాడు. టెన్సింగ్ మీతోపాటు బ్రిటన్‌కు ఎందువల్ల రావడంలేదని అడగ్గా "ఆయన భవిష్యత్ కార్యక్రమాన్ని గూర్చి నాకు తెలియదు. అయితే ఆయనసతి మొదట టెన్సింగ్ డార్జిలింగ్ రావాలనికోరింది. తర్వాత ఆయన ఇంగ్లండు వస్తాడని ఆశిస్తాను"అన్నాడు.

టెన్సింగ్‌తోపాటు ఎవరెస్టుఎక్కిన సర్ ఎడ్మండ్ హిల్లరీ మాట్లాడుతూ "నేను,టెన్సింగ్ శిఖరాగ్రాన్ని దాదాపు ఒకేసారం చేరాము." అన్నాడు. శిఖరాగ్రాన్ని యిద్దరూ ఒకేసారి చేరడానికి తగినంత స్థలంలేదా అని అడగ్గా "ఒక మనిషే శిఖరాగ్రాన్ని చేరుకోగలడు. మే మిద్దరమూ ఒకే త్రాటితో కట్టుకున్నాము" అన్నాడు.

ఎవరెస్టును తిరిగి ఎక్కుతారా అని కర్నల్ హంట్‌ను అడగ్గా, "తిరిగి మేము ఎవరెస్టుకు రావడంలేదు కాంచనగంగ ఎక్కాలని వుందిగాని, అందుకుగల అవకాశాలేమిటో తెలీదు" అని జవాబు చెప్పాడు.

జూలై 1న కర్నల్ హంట్ బృందం లండన్‌కు వెడతారు.

కలకత్తాకు ఎవరెస్టు జట్టు రాక

కలకత్తా, జూన్ 24

కర్నల్ హంట్, తదితర ఎవరెస్టు అధిరోహణ జట్టు సభ్యులు నేటి మధ్యాహ్నం ఖాట్మండూనుంచి ఇక్కడికి వచ్చారు. వీరు ప్రభుత్వ అతిధులుగా రాజభవనంలో వుంటున్నారు.

రాజభవనానికి రాగానే, వీరు గవర్నర్‌తో మాట్లాడారు. తర్వాత కలకత్తా మేయర్ వచ్చి కలుసుకున్నారు.

చైనాలో కీలక పరిశ్రమల అభివృద్ధి

డాక్టర్ జయసూర్య అభిభాషణ

హైదరాబాద్, జూన్ 23

చైనాలో నెలకుపైగా పర్యటన జరిపి వచ్చిన హైదరాబాద్ పీపుల్సు డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు డా॥ జయసూర్య పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ అక్కడి పరిస్థితులను గురించి యిలా అన్నారు:

చైనాలో వ్యావసాయిక వస్తువుల ధరలూ, ఇతర వస్తువుల ధరలూ స్థిరీకరించబడినాయి. ఇనుము, ఉక్కు, రసాయనిక, పెట్రోలియంలాంటి కీలక పరిశ్రమలను అభివృద్ధిచేయడానికి నేడు వారుతమశక్తిని కేంద్రీకరించుతున్నారు. వారు ప్రారంభించిన పంచవర్ష ప్రణాళిక జయప్రదంగా సాగిపోతోంది.

చైనాలో ప్రాథమిక నిర్బంధ విద్య ప్రవేశపెట్టబడింది. రోమన్‌లిపిని స్వీకరించడానికి వారు యిష్టపడక తమ భాషను తేలిగ్గా అభ్యసించడానికి వీలయ్యే పద్ధతులను ప్రవేశపెట్టారు.

చైనాలో సంపూర్ణమైన శాంతి సహకారం అన్ని రంగాల్లో వర్ధిల్లుతోంది. మతానికి ఎలాంటి వ్యతిరేకత కనపడదు. మైనారిటీలకు తగు రక్షణలు కల్పించబడ్డాయి. బౌద్ధ సంస్కృతి ఛాయలు దేశంలో ఎక్కడచూసినా కనపడతాయి.

ఇండియా - రష్యాల సాంస్కృతిక ఆర్థిక సంబంధాలు

నూతన సోవియట్ రాయబారి ఆశాభావం

న్యూఢిల్లీ, జూన్ 24

భారతదేశంలో నూతన సోవియట్ రాయబారి ఎ. బెండిక్టోవ్ ఈవేళ ఉదయం ఇక్కడకు చేరుకున్నారు. పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇండియా - సోవియట్ యూనియన్‌ల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలను మరింత ఎక్కువగా అభివృద్ధి చేయడానికి ఇండియాలోని సోవియట్ రాయబార కార్యాలయం ఇతోధికంగా కృషిచేయగలదన్నారు. సోవియట్ ప్రజలపట్ల భారత ప్రజలు ప్రదర్శించిన అత్యంత స్నేహభావానికి తన హృదయపూర్వకమైన కృతజ్ఞతను తెలిపారు.

జూలై నెల ఆరంభంలో నూతన సోవియట్ రాయబారి తన అధికార పత్రాలను రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌కు అందజేస్తారు.

అమెరికాకు సిగ్గుచేటు

మెకార్తీకమిటీపై రూజ్వెల్టుసతి ఖండన

వాషింగ్టన్, జూన్ 23

సెనేటర్ జోసఫ్ మెకార్తీ అధ్యక్షత కింద వ్యవహరిస్తున్న "అమెరికా వ్యతిరేకచర్యల పరిశోధక ఉపసంఘం" అమెరికా దేశానికే సిగ్గు చేటుగా ఉన్నదనే అభిప్రాయంతో నేనేకీభవిస్తున్నానని రూజ్వెల్టుసతి నేడు స్పష్టం చేసింది.

రోజెన్‌బర్గ దంపతులను అరెస్టుచేసి వారిపై దేశద్రోహం కేసుపెట్టినది ఈ ఉపసంఘమే.

ఈ ఉపసంఘాన్ని రద్దు చేయడం చాల మంచిదని తెలిపింది.

ఈలోగా సెనేటర్ మెకార్తీ తన సహజ ధోరణిలో మరొక నాటకం ప్రారంభించాడు. తనను హత్యచేయడానికి కమ్యూనిస్టులు కుట్ర పన్నారనీ ఆ కుట్రను గురించి భోగట్టా ఇవ్వగల వారిద్దరు దొరికారని అతనొక ప్రకటన చేశాడు.

అమెరికా సి. ఐ. డి. శాఖలో ఇదివరకు ఉద్యోగిగా ఉండిన జోసఫ్ మాజీ అనే అతను ఈ కుట్రను గురించి జూన్ 18 తొలిసారిగా తెలియజేశాడట. స్లాబర్డ్ జా అనే అతను ఒక 'రహస్య మీటింగు'లో, మెకార్తీని చంపేపని కమ్యూనిస్టుపార్టీ తనకు వప్పగించిందని ఒకనితో చెబుతుంటే తాను విన్నానని అతను తెలిపాడట. ఈ కుట్రను గురించి భోగట్టా ఇవ్వగలవారినిద్దరినీ, తన అధ్యక్షత కిందనున్న 'అమెరికా వ్యతిరేక చర్యల పరిశోధక ఉపసంఘం' ఎదుట విచారిస్తానని మెకార్తీ ప్రకటించాడు.

ఇరాన్ వచ్చేనావలకు కొత్త షరతు

తమకు కావలసిన నూనెను ఇరాన్‌నుండే కొనుక్కోవాలట

లండన్, జూన్ 24

ఇరాన్‌వచ్చే నావలు, అక్కడనుండి తమ ప్రయాణానికి కావలసిన నూనెను ఇరాన్‌నుండే కొనుక్కోడానికి ఇష్టపడని నావలేవీ కూడా తమ నౌకాశ్రయాలలోకి రాకూడదని ఇరాన్ ప్రభుత్వం ఒక ఉత్తరువును ప్రకటించినట్లు బసరాలోని లాయిడ్ కంపెనీ ఏజంటు తెలిపాడు.

ఈ ఉత్తరువు తక్షణమే అమలు జరగాలనికూడా ప్రభుత్వం శాసించింది.

ఐ. రా. స. సాంస్కృతిక సమావేశం

రాధాకృష్ణ నాయకత్వాన భారత ప్రతినిధివర్గం

న్యూఢిల్లీ, జూన్ 24

జులై 1 వ తేదీన పారిస్‌లో ప్రారంభమవుతున్న ఐక్యరాజ్యసమితి విద్యా సాంస్కృతిక ప్రత్యేక సమావేశానికి వెళ్ళే భారతీయ ప్రతినిధి వర్గానికి ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ నాయకత్వం వహించుతారని ఈవేళ విద్యాశాఖా మంత్రివర్గం ప్రకటించింది. ప్రతినిధివర్గంలో ఫ్రాన్సులో ఇండియా రాయబారి సర్దార్ యస్. మాలిక్, డాక్టర్ యస్. భట్నాగర్, డాక్టర్ లక్ష్మణస్వామి మొదలియార్‌లు సభ్యులుగా ఉంటారు.

ఢిల్లీలో జనసంఘ ఆందోళన

తాత్కాలికంగా 18 రోజులు ఆపుదల

న్యూఢిల్లీ, జూన్ 24

జమ్మూలో ప్రజాపరిషత్తు ఉద్యమానికి మద్దతుగా ఇక్కడ జనసంఘం, హిందూమహాసభ, రామరాజ్య పరిషత్తులు సాగించుతున్న ఆందోళనను 18 రోజుల వరకూ ఆపివేయవలసిందిగా కోరుతూ జనసంఘ కార్యదర్శి పండిత మౌళిచంద్రశర్మ ఒక ప్రకటన చేశారు.

షాంఘై ఘటనలపై కాథలిక్కుల ప్రచారం

హాంకాంగ్, జూన్ 02

టీన్‌ట్సీన్‌రేవు పట్టణంలోను, షాంఘైలోను కొంతమంది రోమన్ కాథలిక్కు మత గురువులను నిన్న అరెస్టుచేశారు. చాలా కాలంనుంచి వీరు అమెరికా ప్రభుత్వపు తరఫున, చాంగ్-కై-షేక్ తరఫున గూఢచారులుగా పనిచేశారని బయటపడింది. వీరంతా విదేశీయులే.

వీరిని అరెస్టుచేసినందుకు నిరసనగా షాంఘైలో వీరి అనుచరులు కొంతమంది ప్రదర్శనలు చేశారు. తత్ఫలితంగా అధికారులు షాంఘైలోని 'క్రైస్తు ది కింగు' చర్చివద్ద కాపలా పెట్టారని ఆ చర్చి అధికారి ఒకడు నేడిక్కడ తెలిపాడు.

అరెస్టయినవారి ఇళ్ళవద్ద కూడ పోలీసుబందోబస్తు చేశారన్నాడు. ఆ చర్చికి సంబంధించిన మతగురువులలో అరెస్టు కాగా మిగిలిన వారందరినీ — చైనా వారితోసహా, తమతమ ఇళ్ళనుంచి బయటికి కదలకూడదని శాసించారనికూడా అతను తెలిపాడు. ఈ విషయాలన్నీ తెలుపుతూ తనకు షాంఘై నుంచి ఒక జాబు వచ్చిందన్నాడు.

1953 జూన్ 26 శుక్రవారం
విజయ సంవత్సర
జ్యేష్ఠ శుద్ధ
చతుర్దశి ఉ. 9-44
జ్యేష్ఠ. వ. 11-49

ఆంధ్రరాష్ట్ర మోటారు కార్మిక మహాసభ

జులై 14, 15 తేదీలలో తాడేపల్లిగూడెంలో

విజయవాడ, జూన్ 22

ఆంధ్రరాష్ట్ర మోటారు కార్మిక మహాసభ పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెంలో జులై 14, 15 తేదీలలో జరుగుతుంది. తమిళనాడ్ మోటారు కార్మిక నాయకులు, హైదరాబాద్ స్టేట్ మోటారు ట్రాన్స్‌పోర్టు నాయకులు సభకు ప్రత్యేకాహ్వానంపై వస్తున్నారు. ఇంకా పలువురు కార్మిక నాయకులు పాల్గొంటారు.

లోగడ అన్ని యూనియన్‌లకు పంపిన ప్రశ్నావళికి జవాబులు, వెంటనే పంపాలనీ, ప్రతి మోటారు కార్మిక కేంద్రంనుండి రాష్ట్ర మహాసభకు ప్రతినిధులను (25 మందికి ఒకరు వంతున) ఎన్నుకుని వారి పేర్లు, విలాసాలు కూడా జులై 10 వ తేదీలోగా, [illegible]భట్ల సత్యనారాయణ, 'వర్కర్' సంపాదకులు, విజయవాడ 2. అడ్రస్‌కు పంపాలని ఆర్గనైజింగ్ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

"కొత్త ప్రభుత్వంపై కొండంత ఆశవద్దు"

ప్రొద్దుటూరు సభలో శ్రీ సంజీవరెడ్డి ప్రసంగం

ప్రొద్దుటూరు, జూన్ 22

కడపజిల్లా ప్రొద్దుటూరు సుందరాచార్యుల క్లబ్ ఆవరణలో నిన్న సాయంకాలం బహిరంగసభ జరిగింది. శ్రీ జి. మధ్వమునిరావుగారు సభకు అధ్యక్షత వహించారు.

ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ నీలం సంజీవరెడ్డిగారు సభలో ప్రసంగిస్తూ, రాజధాని నిర్ణయంపై ప్రజాభిప్రాయం తెలుసుకోడానికే తామిక్కడ వచ్చామన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"కర్నూలు రాజధాని అయితే రెండు రూపాయలు జేబులో వేసికొని వెళ్ళి రాగలం. అదే దూర ప్రాంతంలోవుంటే ఎంత కష్టం? ఇక మీదట కర్నూలుకు నేరుగా రైలు మార్గం వేస్తాం. అక్కడే చక్కటి బిల్డింగులు కట్టిస్తాం."

పిమ్మట ప్రాజెక్టులను ప్రస్తావించి ఇలా చెప్పారు:

"సిద్ధేశ్వరం, గండికోట, తుంగభద్ర హైలెవల్ కాలవలు రాయలసీమకు ఎంతో అవసరం. తుంగభద్ర హైలెవల్ కాలవలు డబ్బులేక ఆగిపోయింది. సర్కారువాళ్లు నన్ను పరీక్ష చేయడానికై నందికొండ ప్రాజెక్టు మహాసభకు అధ్యక్షత వహించమని కోరారు. వెళ్ళాను. కృష్ణనీరు అరవదేశానికి తీసుకపోకూడదన్నారు. సరేనన్నాను. నందికొండతోపాటు సిద్ధేశ్వరం, గండికోటలుకూడ కట్టాలని చెప్పాను. కాని ఆంధ్రరాష్ట్రం వస్తాకే ఏదో అంతా మారిపోతుందని అనుకోవద్దు."

రంగారెడ్డి ప్రసంగం

తరువాత మంత్రి రంగారెడ్డిగారు తమ ప్రసంగంలో ఇలా అన్నారు:

"నూతన ఆంధ్రరాష్ట్రం ఏర్పడితేగాని మన ప్రాజెక్టులు కట్టడం సాధ్యమని నేను భావించడంలేదు. పంచవర్ష ప్రణాళికలో అప్పుడే రెండు సంవత్సరాలు గడచిపోయినాయి. భట్టాచార్య కమిటీ, ఖోస్లాకమిటీ రాయలసీమకు ద్రోహం చేసినాయి. సిద్ధేశ్వరం - గండికోట-నందికొండ ఒక కేమారు కట్టుతారనే నమ్మకం నాకు లేదు."

తిరుపతిలో విశ్వవిద్యాలయం పెట్టాలని; కర్నూలులో రాజధానిని ఏ పరిస్థితులలోను తొలగించరాదని కోరుతూ సభలో తీర్మానించబడింది. (వి. వి.)

తెలంగాణా గ్రామాల్లో పెద్దఎత్తున కూలీసమ్మెలు

దొంగకేసులతో కార్యకర్తలపై పోలీసు నిర్బంధాలు

మెదక్, జూన్ 20

మెదక్, నర్సపురం తాలూకాల్లో వారం రోజులుగా వ్యవసాయ కూలీల సమ్మెలు పెద్దయెత్తునజరుగుతున్నాయి. సక్రమమైన జీతాలు కావాలనీ, భూస్వాముల దౌర్జన్యాలు అరికట్టాలనీ వ్యవసాయ కూలీలు తమ కోర్కెల్లో వెల్లడించారు.

భూస్వాములూ, పోలీసులూ కలిసి సమ్మెచేస్తున్న కూలీలపైనా, కార్యకర్తలపైనా దొంగకేసులు బనాయిస్తున్నారు. మెదక్ తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు ముత్యాయిపల్లినరసింహారెడ్డికి కూడా యీ కుట్రలో భాగమున్నట్టు తెలుస్తున్నది. సర్దన గ్రామంలో రైతు సంఘాధ్యక్షుడు జీవరత్నం గారిపైనా, వ్యవసాయ కూలీలపైనా దొంగతనం కేసు బనాయించి అరెస్టు చేయించారు.

ఈ అరెస్టుకు అసమ్మతి తెలియ బరుస్తూ వెయ్యిమంది రైతులు, కూలీలు పెద్ద ఊరేగింపు చేశారు. అరెస్టుచేసిన వారినందరిని విడుదల చేయాలంటూ ప్రదర్శకులు నినాదాలిచ్చారు. సర్దన గ్రామంలో పెద్ద బహిరంగసభ కూడా జరిగింది. సభలో శ్రీ గురవారెడ్డి, శ్రీ కిషన్‌గార్లు ఉపన్యసించారు.

నర్సపురం తాలూకా నాందాసుపల్లి, బుజురంపేటల్లోకూడా వ్యవసాయకూలీ సమ్మెలు జరుగుతున్నాయి. అక్కడకూడా కార్యకర్తలైన శ్రీ సున్నం బాలయ్య, తాటి మల్లయ్య, మన్నే రామయ్య మున్నగువారిపై దొంగ కేసులు బనాయించబడ్డాయి. పోలీసు స్టేషనుకు తీసుకెళ్లి, కార్యకర్తల్ని హింసిస్తున్నట్టుకూడా తెలుస్తున్నది. - పోలీసులు గ్రామాలపై దాడులుకూడా సాగిస్తున్నారు.

కాంగ్రెసు ప్రభుత్వపు కుటిల వాగ్దానాలు

వరంగల్ సభలో శ్రీ సుందరయ్య ఉపన్యాసం

వరంగలు; జూన్ 23

నిన్నటిదినం సాయంకాలం పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన వరంగల్ నగరంలో బహిరంగసభ జరిగింది సభలో విశాలాంధ్ర కమ్యూనిస్టునాయకులలో ఒకరగు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యాగారికి నగరంలోని పలు ప్రజాసంస్థలు స్వాగతంఇచ్చాయి. శ్రీ సుందరయ్య కాంగ్రెసు ప్రభుత్వపు భూమి సంస్కరణ చట్టాల బూటకాన్ని కడు తీవ్రంగా విమర్శించి ఇల్లాఅన్నారు:

"నిజంగా రైతులకు భూములివ్వదలచే వాళ్ళ వుద్దేశమయితే ఏళ్ళకరబడి రైతుల చేతులలో వున్న భూములను లాక్కునే చట్టాలు ఎందుకు ఎందుకీ పోలీసు దుండగాలు ?"

సభలో ప్రభుత్వ నిర్బంధ చర్యలను ఖండిస్తూ, ఈమధ్యనే అరెస్టు చేసిన జిల్లా కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ సభ్యులు శ్రీ చుండూరు నరసింహారావు, తీగల సత్యనారాయణ, నల్లమల ప్రసాద్‌గార్లను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు.

శ్రీ కేసాని నారాయణ విడుదల

జనగామ, జూన్ 20

జనగామ మాజిస్ట్రేట్ నిన్నటిరోజున శ్రీ కేసాని నారాయణగారిపై హత్యానేరం నిరాధారమని త్రోసివేస్తూ ఆయనను విడుదల చేయాలని తీర్పునిచ్చారు. శ్రీ నారాయణగారిపై ప్రస్తుతం ఏమీ కేసులు అమలులో లేకపోయినా ప్రభుత్వం మరో రెండు కేసులను మాత్రం ఫైల్ చేసిందని మాజిస్ట్రేటు చెప్పారు.

శ్రీ నారాయణ జనగామతాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి. ఈయనను ఏడాదిక్రితం అరెస్టుచేసి హత్యానేరాలు రెండు ఆరోపించి వరంగలు జైలులో వుంచారు. ఆ కేసులలో ఒకటి ఇదివరకే కొట్టివేయబడింది. రెండోది చినమడూరు హత్యకేసు దీనిలోకూడ వీరు నిరపరాధియని మాజిస్ట్రేటు తీర్పునిచ్చారు.

ఇదే హత్యకేసులో శ్రీ గబ్బెట మోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి,హనుమంతుగార్లనుకూడా సెషన్సు కోర్టులో విచారణ చేస్తున్నారు. వీరి ఆరోగ్యాలు పూర్తిగా చెడిపోయినాయి. నేడు కొండల్‌రెడ్డి మరణాసన్న దశలో వున్నారు.

నల్లగొండ జైల్లో నిరశన వ్రతం

వైద్యంచేయించడానికి ప్రభుత్వం నిరాకరించిన కారణంగా

నల్లగొండ, జూన్ 23

నల్లగొండజైల్లో యున్న రాజకీయఖైదీ శ్రీ మోహన్‌రెడ్డిగారు 22 వ తేదీనుంచి నిరశనవ్రతం చేస్తున్నారు. ఒక సంవత్సరంగా గాస్ట్రిక్‌వ్యాధితో బాధపడుతున్న వీరిని మాసం రోజులక్రితం ఉస్మానియా హాస్పటల్‌కు పంపించి, వ్యాధి యింకా నెమ్మదించక పూర్వమే తిరిగి నల్లగొండ జైలు హాస్పిటల్‌కు మార్చారు. వీరికి వైద్యం చేయించుటకన్నా, ప్రభుత్వం కేసునడిపించి శిక్ష వేయడానికే ప్రాధాన్యత యిస్తుండటం వల్ల నిరసనవ్రతం మొదలెట్టినట్లు తెలుస్తుంది.

శ్రీ మోహన్‌రెడ్డిగారికి నల్లగొండ జైలులో సరియైన వైద్యసదుపాయాలు చేయటం లేదు. వీరేగాక ఇదేజైలులో రాజకీయ ఖైదీలైన శ్రీ మురహరిరావు, జాన్‌రెడ్డిగార్ల ఆరోగ్యాలుకూడ చెడిపోయాయి. డాక్టర్లు ఏమీ శ్రద్ధతీసుకోవడం లేదు.

రోజెన్‌బర్గ్‌ల ఉరిపై నల్లగొండ ఖైదీల నిరసన

నల్లగొండ, జూన్ 24

రోజెన్‌బర్గు దంపతులను ఉరి దీసినందుకు నిరసనగా నల్లగొండ జైలు రాజకీయ ఖైదీలు నలభైమంది నిన్న నిరసన వ్రతం చేశారు. తమ నిరసనను అమెరికా ప్రభుత్వానికి తెలియజేయాల్సిందిగా అమెరికా రాయబారికి జాబు వ్రాశారు.



ఉషా పంకాలు

అద్వితీయమైన పనితనం, తీరుచేయబడిన సొగసైన నిర్మాణం
తక్కువ కరెంటు ఖర్చుతో అవసరమైన రెపొజిటేటర్ మోటారు.
అన్ని ప్రదేశములలో, అందం, సౌఖ్యం యిచ్చును.
60 అం. 56 అం. 48 అం. 36 అంగుళాలలో దొరకును.
200 ఓల్ట్సు — 50 సైకిల్సు.
జె ఇంజనీరింగ్ వర్క్సు, లిమిటెడ్; కలకత్తా.
నర్సప్లే సేల్సు ఆఫీసు 7, ఎకంబ్ స్టేషన్ రోడ్ మద్రాసు 1
దక్షిణ ఇండియాకు ఏజంట్లు:
అల్లయిడ్ ఇండస్ట్రియల్ డిస్ట్రిబ్యూటర్సు లిమిటెడ్.
7, సెకండ్ లైన్ బీచ్, మద్రాసు-1

నిజాం నవాబుగారి భూదానంలోని బూటకం

హైదరాబాద్, జూన్ 23

శ్రీ వినోభాభావే ఆరంభించిన భూదానయజ్ఞానికి నిజాం నవాబు 3,651 యకరాలు దానం చేసినట్టుపత్రికల్లో పెద్దఘనంగా ప్రకటించబడింది. ఈ భూదానం అంతా బూటకమనీ, ఈ భూమి సాగుకు పనికివచ్చేది కాదని విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై భూదానయజ్ఞ సమితి విచారణ జరపగా 3,651 యకరాల్లోనూ మూడు వందల యకరాలు మాత్రమే సాగుకు పనికివచ్చే భూమి అనీ, 500 యకరాలు అరణ్యమనీ, మిగతా 2,851 ఎకరాలూ పనికిమాలిన గుట్టలు అనీ తేలింది.

భూదానయజ్ఞానికి వినోబాభావే సంపాదించిన 58 వేల యకరాల్లోనూ అత్యధికభాగం యిట్టిదేనని కూడా తెలియ వస్తున్నది.

సికింద్రాబాద్‌లో కొత్తపన్నులపట్లఅసమ్మతి

సికింద్రాబాద్ జూన్ 23

సికింద్రాబాద్ కార్పొరేషన్‌లో కొత్తగా తలపెట్టిన మున్సిపల్ పన్నుల పట్ల అసమ్మతి తెలియపరుస్తూ 800 మంది పౌరులు కార్పొరేషనుకు ఒక మహజరు పంపించారు. పాపులపైనా, దుకాణాలపైనా విధించబోతున్న ఈ పన్నులను ఉపసంహరించుకోవలసిందని కూడా అందులో కోరారు.

షాహాబాద్ సిమెంటు ఫ్యాక్టరీకార్మికసంఘం

కార్యవర్గ ఎన్నికలు

హైదరాబాద్, జూన్ 23

షాహాబాద్ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికసంఘం శ్రీ యన్. సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన యిటీవల సమావేశమై కొత్తసంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నది. శ్రీ యన్. సత్యనారాయణ రెడ్డి అధ్యక్షులుగనూ, డాక్టర్ రాజ్‌బహదూర్ గౌడ్, పి. గోపాలస్వామి, తమ్మయ్యగార్లు ఉపాధ్యక్షులుగనూ, కోకాబ్ దుర్రె కార్యదర్శిగానూ ఎన్నుకోబడ్డారు.

జంగ్లాత్ వుద్యోగుల దౌర్జన్య చర్యలు

పాల్వంచ తాలూకాలో కాక సింగప్ప బలి

పాల్వంచ, జూన్ 20

పాల్వంచ తాలూకా తెర్లకుంట, నందిపాడు, తోకు గూడెం మున్నగు గ్రామాలకు జంగ్లాత్ తనిఖీదారు వెళ్ళి కలప తెమ్ముకున్నందుకు, యిళ్ళు కట్టుకున్నందుకు లంచా లివ్వాలని గ్రామస్తుల్ని బెదిరిస్తున్నాడు.

లంచం యివ్వ నిరాకరించిన కాక సింగప్ప అనే గ్రామస్తుని తనిఖీదారు చావబాదగా, అయిదోరోజున సింగప్ప మరణించాడు.

'రాజధాని నిర్ణయం అన్యాయం'

దామెగుంట, జూన్ 22

రాజధాని కర్నూలులో నిర్ణయించినందుకు నెల్లూరు జిల్లా దామెగుంట ఏరియా కల్లుగీత పనివారల సంఘ సమావేశంలో నిరసిస్తూ తీర్మానించారు.

పందిళ్ళపల్లి గ్రామ చేనేతసంఘ నిరసన

ఆంధ్రప్రజలందరూ కోరుతున్న విజయవాడను కాదని కర్నూలు రాజధానిగా నిర్ణయించినందుకు పందిళ్ళపల్లి గ్రామ చేనేతసంఘం నిరసిస్తూ తీర్మానించింది.

కోవూరుతాలూకా యువజనసంఘం

ఆంధ్రప్రజలు సాగించిన వీరోచిత పోరాటం ఫలితంగా సాధించుకున్న ఆంధ్రరాష్ట్రాన్నితమ పదవులపంపకాలకోసం వుపయోగించుకోవాలని మాస్తున్న కాంగ్రెసు, కృషికార్, ప్రజాసోషలిస్టు పార్టీల చర్యలను నిరసిస్తూ, కర్నూలు రాజధానిగా నిర్ణయించినందుకు అసమ్మతి తెలుపుతూ నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా యువజన సంఘంవారు తీర్మానించారు.

ఆంధ్ర రాష్ట్రంలో నూతన విద్యాప్రణాళిక అమలు

కొత్తప్రభుత్వం ఇష్టానిష్టాలకే వదలాలని రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ విజ్ఞప్తి

కడప, జూన్ 22

ఆంధ్రరాష్ట్రప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి శ్రీ వి. విజయరామరాజుగారిలా ప్రకటిస్తున్నారు:

"మద్రాసు ప్రభుత్వం ఒంటిపూట పాఠశాలలనే నూతన విద్యా ప్రణాళికను శరవేగముతో అమలు జరుపుటకు ప్రయత్నిస్తోంది.

ఈ ప్రణాళికలోనున్న లోపాలను వివరంగా ఎత్తిచూపిస్తూ, వెంటనే ఆపవలసినఅవసరాన్నిగురించి ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ తన 'ఉపాధ్యాయ' పత్రికలో వరుసగా రెండు సంపాదకీయాలు వ్రాసింది. ఆంధ్రలోని ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో ఈ ప్రణాళికను నిరసిస్తున్నారు అనేక పత్రికలు, పంచాయితీ బోర్డులు, చెన్నరాష్ట్ర జిల్లాబోర్డు అధ్యక్షులసంఘమూ ఈ నూతన ప్రణాళికను అమలుజరుపవద్దంటూ విజ్ఞప్తులు చేశాయి.

ఇంత వ్యతిరేకత వస్తున్నప్పుడు పునః పరిశీలన చేయడంగాని, ప్రజాభిప్రాయం సేకరించడంగాని చేయక బడి వయసుగల 75 లక్షల బాలబాలికల భావిజీవితాన్ని శాసిస్తున్న ఒక విద్యాశాసనాన్ని ప్రభుత్వం మంకుపట్టుగా ప్రవేశపెట్టడం, దాన్ని చేదుగానైనా మింగవలసిందేనని తన విద్యాధికారులద్వారా ఉపాధ్యాయులకు చెప్పించడం చాల ఆశ్చర్యకరమైన విషయం.

తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజనాడర్ ఈ నూతన ప్రణాళికను నిశితంగా విమర్శిస్తూ ప్రకటించారు. రాష్ట్రంలోని విద్యావేత్తలు మేధావులు ఈ స్కీములో గల మంచిచెడ్డలను గురించి ఆలోచించి తమ అభిప్రాయాలను తెల్పుటకు తగు వ్యవధి కూడా యివ్వకుండా ప్రణాళికను ప్రకటించిందే తడవుగా అమలుజరుపుటకు సకల సన్నాహాలనూ పూర్తిచేసింది ప్రభుత్వం.

బయటప్రజలకే గాక లోపలమంత్రివర్గంలో కూడా ఒక ఖచ్చితమైన అభిప్రాయం లేనట్లుంది. ఉపాధ్యాయులను తగ్గించవలసివస్తుందని ఆర్థికామాత్యులు శ్రీ సుబ్రమణ్యంగారు సెలవిస్తే, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గింపబోమని హామీలనిస్తూ ముఖ్యమంత్రి రాజాజీగారు ప్రకటిస్తున్నారు. అందరి అభిప్రాయాలు సేకరిస్తే సంవత్సరాలు పడుతుందని సులభంగా త్రోసివేసిన రాజాజీగారు ఇంత ముఖ్యమైన విద్యావిధానాన్ని అసెంబ్లీలో చర్చకు ప్రతిపాదించక, అసెంబ్లీముగిసినతర్వాతఎందుకు ప్రకటించవలసివచ్చింది? ప్రజల, పత్రికల ప్రజాప్రతినిధుల, విద్యావేత్తల, ఉపాధ్యాయుల అభిప్రాయాలను కనుక్కోకుండా అతిముఖ్యమైన ఈ మార్పును అమలు జరుప బూనుకోవడంయేరకానికి చెందిన ప్రజాస్వామికమో అర్థంకాదు.

అక్టోబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం అవతరించనున్నది. ఆంధ్రదేశ విద్యావిధానం ఎలావుండాలో నిర్ణయించగల హక్కు ఆంధ్ర ప్రభుత్వానికి మాత్రమే వుంది. నాలుగు మాసాలు ఆగినంతమాత్రాన మునిగిపోయే దేమీలేదు. ఆంధ్రరాష్ట్రం సాధు చెప్పే అనేక అభ్యుదయ ప్రణాళికలు ఆపివేస్తున్న ప్రభుత్వం ఈ స్కీమును ఆపడం కష్టమేమీ గాదు. ఆంధ్ర ప్రభుత్వం ఏర్పడేవరకు ఈ స్కీమును ఆపాలి. లేదా ఆంధ్ర జిల్లాలకు ఈ స్కీమును వర్తింపచేయడం మానాలి. అందుకై ఆంధ్ర శాసన సభ్యులు పత్రికలు, విద్యార్థులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు కలసి తీవ్ర ఆందోళన చేయాలని అభ్యర్థిస్తున్నాను

మద్యపాన నిషేధం రద్దుచేయాలి

దామెగుంట, జూన్ 22

దామెగుంట (నెల్లూరు జిల్లా) ఏరియా కల్లుగీత కార్మిక సహకార సంఘ సర్వసభ్య సమావేశం 20 వ తేదీన దామెగుంటలో జరిగింది.

ఆసభలో విఫలమైన మద్య నిషేధ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని, ఈలోగా గీత కార్మికులకు నీరా అమ్ముకొనుటకు అనుమతించాలని కోరుతూ తీర్మానించారు.

నెల్లూరు జిల్లాలో శాంతి ఉద్యమ పురోగమనం

కన్వెన్షన్ చర్చల వివరాలు

నెల్లూరు, జూన్ 22

నెల్లూరుజిల్లా శాంతి కన్వెన్షన్ జూన్ 20, 21 తేదీల్లో నెల్లూరు టౌన్ హాలులో జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి సుమారు 80 మంది ప్రతినిధులు వచ్చిన ఈ సభకు శ్రీ అమంచర్ల గంగాధరరావు(అడ్వకేట్) గారు అధ్యక్షత వహించారు.

తొలుదొల్త రోజెన్‌బర్గు దంపతులను అక్రమంగా వురికంబాలకు పంపించిన అమెరికన్ ప్రభుత్వ చర్యను ఖండించుతూ, వారికి సమావేశం జోహారులర్పించింది.

శాంతి ఉద్యమాన్నెదుర్కొన్న వివిధ కర్తవ్యాల గురించి శ్రీ ఖండవల్లి కృష్ణారావు ఎం. ఎల్. ఏ., గంగాధరరావు, వి. అనంతరామయ్య, (అడ్వకేటు) సుబ్బరామరెడ్డి, యల్లమందారెడ్డి ఎం.ఎల్.ఏ, పి.వి. రాఘవయ్య ఎమ్.పి. బి. శంకరయ్య, ఎం. ఎల్. ఎ. శ్రీ వి. కళ్యాణసుందరం ప్రభృతులు మాట్లాడారు.

శాంతి ఉద్యమం యుద్ధ నివారణ కృషితోబాటు ప్రజల పౌర స్వత్వ హక్కులు రక్షించేందుకు కృషి చేయాలాలేదా అనే చర్చ ప్రాముఖ్యంగా జరిగింది.

శాంతి ఉద్యమం విస్తృత ప్రజా ఉద్యమంగా అభివృద్ధి కావాలంటే శాంతిప్రచారంతోబాటు ప్రజలప్రాణాలను,పౌరస్వత్వ హక్కులను కాపాడాలని ఒక వాదన; ఈ సమస్యలపై పోరాటానికి వర్గసంఘాలు ఇతరప్రజా సంఘాలు ఉన్నాయని, ఈసమస్యలలో తలదూర్చితే శాంతిసంఘప్రధానఆశయం నుండి వేరుపడిపోయి వివిధరాజకీయాభిప్రాయాలు గలవారిని యుద్ధానికి వ్యతిరేకంగా సమీకరించటంలో విఫలమౌతుందని మరొకవాదన వచ్చాయి.

తుదకు యీ విషయాన్ని రాష్ట్ర సంఘానికి, అఖిలభారత సంఘానికి కూడా వ్రాసి ఆ తర్వాత మరల చర్చించవచ్చునని సమావేశం ఒక అభిప్రాయానికి వచ్చింది.

పిమ్మట త్వరలో జరగబోవు రాష్ట్ర శాంతిమహాసభకు ప్రతినిధులను ఎన్నుకొన్నారు. జిల్లా శాంతి కమిటీకి శ్రీ ఖండవల్లి కృష్ణారావుగారిని అధ్యక్షులుగను, శ్రీ వి. వి. కృష్ణరావుగారిని ఉపాధ్యక్షులుగను, శ్రీ అమంచర్ల గంగాధరరావు, జి. సి. కొండయ్యగార్లను కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగను ఎన్నుకొన్నారు.

సాముదాయక భూమికై క్షోత్రియందార్ల కుట్రలు

రైతులపై హింసాకాండ

అప్పయ్యపాలెం, జూన్ 20

చెంగల్పట్టు జిల్లా అప్పయ్యపాలెం క్షోత్రియం గ్రామమగుటచే 1950 లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. కాని క్షోత్రియందార్లయిన శ్రీ రామకృష్ణారెడ్డి వగైరాలు కరణాన్ని లోబరుచుకుని అనాదినుండి రైతులు సాగుచేసుకుంటున్న 40 యకరాల భూమిని తమదే అయినట్టు లెక్కలు తయారు చేయించారు. అంతేకాక రైతుల ఇండ్లచుట్టూ వున్న సుమారు 200 యకరాలు సాముదాయిక భూమికూడా తమదేనని రైతులను భూములలోకి రానివ్వకుండా అటకాయించారు.

ఈఅన్యాయాన్ని ఎదుర్కొన ప్రయత్నించిన రైతుల ఇండ్లపై ఈనెల 16 వ తేదీన క్షోత్రియందార్లు లంబాడీలతో దాడిచేయించి విపరీతంగా నష్టపరిచారు. సుమారు 40 మంది రైతులను క్షోత్రియందారైన రామకృష్ణారెడ్డిఇంటికి తీసుకుపోయి రెక్కలు విరిచికట్టి కొందరితో ప్రోనోట్లు వ్రాయించుకున్నారు.

క్షోత్రియందార్ల దౌర్జన్యాల గురించి అధికారులు విచారించి తగు రక్షణ కల్పించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. (వి. వి.)

రోజెన్‌బర్గ్‌ల బిడ్డలకు బాలబాలికల సానుభూతి

చిరువోలు లంకలో

చిరువోలు, జూన్ 22

రోజెన్‌బర్గు దంపతులను ఉరితీశారని తెలియగానేచిరువోలు లంక(కృష్ణాజిల్లా) 40 మంది బాలబాలికలు సమావేశమై పసిపాపల ఆర్తనాదాలు అమెరికన్ హంతకులను పసిఫిక్ సముద్రంలో కలుషిత మానవు అని తీర్మానించారు. ఎన్. ఎస్. చలపతిరావు సభకు అధ్యక్షత వహించాడు, రోజెన్‌బర్గు దంపతులకు జోహారులర్పించుతూ అందరూ రెండు నిముషాలపాటు నిలబడ్డారు.

తల్లిదండ్రులను కోల్పోయిన రోజెన్‌బర్గు దంపతుల బిడ్డలకు సానుభూతి తెలుపుతూ బాలబాలికలు తీర్మానించారు.

జీతాలుఎలవెన్సులు పెంపుదల

సదరన్ రైల్వే ట్రాఫిక్ గుమాస్తాల తీర్మానాలు

కోయంబత్తూర్, జూన్ 22

"రైల్వే ట్రాఫిక్ గుమాస్తాలకు ప్రస్తుతం యిస్తున్న రు 55-130 వేతనం స్కేలు ఎట్టి పరిస్థితులలోను సరిపోదని కనీసం ఈస్కేలు 80-160 కి పెంచాలని పోదనూరు (కోయంబత్తూర్ జిల్లా)లో సదరన్ రైల్వే ఎంప్లాయీస్ ఎసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ట్రాఫిక్ గుమాస్తామహాసభ తీర్మానించింది.

సభకు శ్రీ ఎమ్. వీరాస్వామి నాయుడు అధ్యక్షత వహించారు.

సదరన్ రైల్వే కార్మికనాయకుడు శ్రీ ఆనందనంబియార్ యం. పి. మహాసభను ప్రారంభించుతూ రైల్వే గుమాస్తాల శ్రమను అధికారులుగుర్తించి, ప్రస్తుతం తక్కువగా ఉన్న జీతాలను హెచ్చించాలని, గృహావసతి ఆరోగ్యం ఎలవెన్సు లివ్వాలని హెచ్చరించారు. రైల్వేలు వీటా కోట్లాది లాభాలుతీస్తుండగా - రైల్వే పనివారికి సంతృప్తికరంగా వేతనాలు యివ్వకుండా, డబ్బు లేదని సాకులు చూపటం సరిగాదన్నారు.

తీర్మానాలు

మహాసభ కన్వీనరు, శ్రీ శంకర నారాయణ, శ్రీ వీరాస్వామినాయుడు గార్లు రైల్వే గుమాస్తాల యిబ్బందులు గురించి మాట్లాడిన పిదప రు 80-160 స్కేలు గుమాస్తాలకు యివ్వాలని కోరుతూ తీర్మానించారు. ఈలోగా తాత్కాలిక రిలీఫ్‌గా నెలకు రు 25 లు యివ్వాలని కోరారు.

ట్రాఫిక్ గుమాస్తాలు 'సి' గ్రేడ్ గార్డులుగ, వాగన్ సంచాలకులుగ (చేజర్సు) ట్రాఫిక్ మూవ్‌మెంటుఇన స్పెక్టర్లుగ, సెక్షన్ కంట్రోలర్లుగ ప్రమోషన్లుపొంది పనిచేసే అవకాశాలుకూడా యివ్వబడాలని తీర్మానించారు.

యూనిఫారాలు,వానకోట్లు, గొడుగులు యివ్వాలని, వారాంతపు సెలవులు ఖచ్చితంగా అమలుజరుపబడాలని, సెలవులు 25 వంతులు పెంచాలని, గృహావసతి యిచ్చుటలో అత్యవసర శాఖా ఉద్యోగులుగ పరిగణించాలని కూడా కోరారు.

మహాసభకు విజయవాడనుండి శ్రీ కె. సూర్యనారాయణమూర్తిగారు ప్రతినిధిగా వెళ్ళారు. మహాసభలో వివిధ సంఘాలకు చెందిన వారందరు రావడం ఒక అపూర్వ విషయం.

ఉలిందకొండ ప్రజలపై అక్రమ పన్నులు

కర్నూలు, జూన్ 20

కర్నూలు తాలూకా ఉలిందకొండ గ్రామములో ఆ గ్రామ రెడ్డి (మునసబు) యగు శ్రీ రాఘవరెడ్డి ప్రజలనుండి అనేక విధములైన పన్నులు అక్రమంగా వసూలు చేస్తున్నాడు. అనేకమంది పేదలు, పశువులులేనివారు నేసుకున్న పెంటదిబ్బలకు ఒక్కొక్కదానిక రూ. 5/-వంతున వసూలు చేశాడు. మిరప నారుమళ్ళు - భావి దగ్గరున్న స్థలములోనే వేసుకున్న దానిక కూడ రు. 5/- వసూలు చేశాడు. అంగళ్ళ ముందు తడికలు కట్టుకున్నందుకు కూడ పన్ను వసూలు చేశాడు. వీరిలో ఎవరికికూడ రశీదులు ఇవ్వలేదు. ఏలాటి అనుమతి మంజూరు కూడ లేదు. ఈ పన్నులు కొన్ని గ్రామమునసబు వసూలు చేయవలసినవి కావు.

ఈఅక్రమ పన్నులను ఆపుచేయించి, వాటిని విచారణ జరప న్యాయము కలుగ చేయవలసినదిగా గ్రామ ప్రజలు తాలూకా ఆఫీసర్ గారికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఆయన అప్పుడే విచారిస్తామని వాగ్దానము చేశారు. (వి. వి.)

మైకా కార్మికులకు వెంకటగిరి రాజా అన్యాయం

గూడూరు, జూన్ 23

శ్రీ వెంకటగిరి జమీందారు 1894 సంలో రాపూరు తాలూకా, కల్వేడు గ్రామంలో కళ్యాణ రామా మైకాగని ప్రారంభించాడు. యీ 60 సంవత్సరాల లోపల షుమారు వందమంది కూలీలకు పైగా గనిలో పనిచేస్తున్న సందర్భాలలో చనిపోయారు.

యీ గని ప్రారంభం నుంచి యిప్పటికి రాజాగారు కొన్నికోట్ల రూపాయలు ఆర్జించారు. కాని తమ లాభాల కొరకు ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలకు నష్టపరిహారాలు యివ్వడంగాని లేబరు కమీషనర్‌వారు యిచ్చిన తీర్పు ప్రకారం అమలు జరుపడంగాని చేయలేదు.

24-4-51 తేదీన సంపతి యెంగమ్మ (18 సంవత్సరముల యువతి, పెండ్లికాలేదు) గని వద్దనున్న మట్టి దిబ్బలలో పనిచేస్తుండగా మట్టిదిబ్బ మైనబడి ప్రాణం విడిచినది. చనిపోయిన యెంగమ్మ, 70 సంవత్సరముల ముసలి తల్లిని పోషించుతూవచ్చినది. యెంగమ్మ తల్లికి నష్టపరిహారం ఇవ్వవలసి వస్తుందని యీ కేసు బయటకు పొక్కకుండా కొలజరోజులు త్రొక్కిపెట్టబడింది.

మైకా వర్కర్సు యూనియన్ చేసిన కృషి ఫలితంగా యీ కేసును విచారణ జరిపించి ఆమె కుటుంబానికి 12 వందల రూపాయలు నష్టపరిహారం యిచ్చునట్లు లేబరు కమీషనరు తీర్పు చెప్పారు. యీ 12 వందల రూపాయలు చనిపోయిన కార్మిక కుటుంబానికి యిచ్చేదానికి వెనకాడుతూ "12 వందలు యివ్వలేము, 4 వందల రూపాయలుమాత్రమే చెల్లించగలమని" లేబరు కమీషనరు యిచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా హైకోర్టులో రాజాగారు స్టేఆర్డరు తీసుకవచ్చారు. జూలైనెల 6 తారీకున కేసు విచారణ జరుగుతుంది.

పేద కార్మికులు మరణించితే నష్టపరిహారం యివ్వడానికి కూడా ముప్పుతిప్పలుపెట్టే రాజాగారి చర్యను ప్రజలు ఏవగించుకుంటున్నారు.

మైకా గనుల స్టాండింగు రూల్సు

యజమానుల వింత ధోరణి

గూడూరు, జూన్ 23

మైకా గనుల స్టాండింగు రూల్సు తయారు చేయుటకు రీజనల్ లేబరు కమీషనర్ శ్రీ ఓ. వెంకటాచలం గారు యీనెల 18 వ తారీకున గూడూరుకు వచ్చారు.

పి. డబ్ల్యూ, ట్రావెలింగ్ బంగళాలో కేంద్ర ప్రభుత్వపు తరఫున రీజనల్ లేబరు కమీషనర్, గని యజమానుల తరఫున జక్కంరెడ్డి జయరాం రెడ్డి, పొలేపు దశరథరాంరెడ్డి, వి. దశరథ రామానాయుడు (ఎం. ఎల్. ఎ) గార్లు, కార్మిక సంఘాల తరఫున, సి సి. సుబ్బయ్య, పి. సి. రెడ్డి, సూరిశెట్టి క్రిష్ణయ్య మరికొంతమంది హాజరైనారు.

మైకా గనుల స్టాండింగు రూల్సును గురించి తీవ్రంగా చర్చించి స్టాండింగు రూల్సు తయారు చేయడం జరిగినది. తయారుచేసిన రూల్సుమీద కార్మిక ప్రతినిధులు, రీజనల్ లేబరుకమీషనర్ మాత్రం సంతకాలు చేశారు. గని యజమానుల ప్రతినిధులుమాత్రం, ఏకగ్రీవంగా తయారుచేసిన స్టాండింగురూల్సు పత్రం మీద సంతకాలు చేయడం నిరాకరించారు.

శాసనసభ్యులు శ్రీ దశరథరామయ్య నాయుడుగారిని శ్రీ పి సి రెడ్డిగారు, మీరు ఏ సంఘాల తరఫున వచ్చారని ప్రశ్నించినందుకు వాగ్వివాదం జరిగి సంతకాలు చేయడం మానివేశారు.

19 వ తారీకు రీజనల్ లేబరు కమీషనరుగారు, ముకేరియా, లక్ష్మీప్రసాద్ మొదలగు మైకాగనులను పరిశీలించారు. మైకా అవార్డు ప్రకారం కార్మికులకు గ్రేయిన్ అలవెన్సు రోజుకు 2 అణాలు, బోనసులు, సెలవులు, యివ్వడంలేదని తెలుసుకున్నారు: దీనిని గురించి నర్యతీసుకొని వెంటనే అమలు జరిపించు గాలని కార్మిక ప్రతినిధులకు తెలియజేశారు.

ఏలూరు మున్సిపల్ ఇంజనీయరు బదిలీ

ఏలూరు, జూన్ 22

ఏలూరు మున్సిపల్ ఇంజనీయరు శ్రీ కె. [illegible] శేషేశ్వరరావుగారిని ఏలూరు నుండి [illegible] ప్రభుత్వం [illegible] [illegible] [illegible] [illegible] విచారించాలని మున్సిపల్ కౌన్సిల్ లోగడ తీర్మానించిన [illegible] [illegible] [illegible].

విజయవాడ విశేషాలు

ఫుట్‌బాల్ టోర్నమెంటు సెమిఫైనల్

విజయవాడ, జూన్ 25

ఇచ్చట జూన్ 9 వ తేదీ నుండి జరుగుతున్న చిట్టిబాబు మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్సు సెమిఫైనల్ ఆట నిన్న సాయంత్రం జరిగింది. విజయవాడ సి. ఆర్. బాస్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు, రతన్‌సింగు మెమోరియల్ జట్టును 8-0 గోల్సుతో ఓడించింది. నేడు ఈ జట్టుకు మ్యాక్ స్టేడియమ్ బళ్ళారి జట్టుకు మధ్య ఫైనల్సు జరుగుతాయి.

వరినారు
మా వద్ద K 12 నారు మాత్రం దొరకును. త్వరపడండి.
కొత్రగడ్డ మధుసూదనరావు
మొగల్రాజపురం-విజయవాడ-2

ఉచితం



రిజిష్టర్డు నెం 501 గల మా నల్లరంగు తల నూనె వాడుటవలన ఏలాంటి వెంట్రుకలైనా సహజమైన నలుపు రంగు యిచ్చి ఎల్లప్పుడూ నల్లగా వుండునట్లు పెరుగును. ఊడిపోయే వాటిని నిల్పి పొడవుగా పెరుగునట్లు చేయును. వంకరలు తిరిగి అందంగా వుండునట్లు చేయును. వెల ఒక ఫియల్ రు 1-12-0 3 ఫియల్సు (పూర్తి కోర్సు) రు 4-8-0

పై నూనెను అందరికి తెలియజేయుటకుగాను మేము ఒక ఫియల్ కొన్నవారికి 15 సం॥ గ్యారంటీ, పనితనం గల ఒక ఫ్యాన్సీ చేతి గడియారం, చేతి ఉంగరం (క్రొత్త బంగారం) యిచ్చుచున్నాం. 3 ఫియల్స్ కొన్నవారికి 6 చేతి గడియారములు, 6 ఉంగరాలు ఉచితం. నచ్చని యెడల ధర వాపసు చేయబడును.

LONDON TRADING COMPANY
(Vav) Jullndur City

రు 5 లకే నిజమైన గడియారం, కలం

అమెరికన్ స్టాండర్డ్ "మార్షల్" ఫౌంటెన్ కలం, 10 సం॥ గ్యారంటీగల నిజమైన స్విస్ గడియారం రు 5/- లకు మా నూతన వ్యాపారాభివృద్ధి నిమిత్తం యిచ్చుచున్నాం. పోస్టేజి అదనం రు 1-0-0. నచ్చని యెడల ధర మొత్తం గ్యారంటీగా వాపసు చేయబడును.

STANDARD COMPANY
(vav) Jullundur City

నగరంలో సినిమాలు

26—6—53

శ్రీదుర్గాకళామందిరం

కాంచన
లలిత, పద్మిని, రామశర్మ
2 ఆటలు

శ్రీ లక్ష్మీటాకీసు

ఛత్రపతి శివాజీ
పృథ్వీరాజ్ మొదలగువారు నటించిరి
మూడు ఆటలు

శ్రీమారుతి సినిమా

అల్లావుద్దీన్ మాయాదీపం
మూడు ఆటలు

శేష్‌మహల్

అనార్కలీ (హిందీ)
[illegible]
[illegible]
2 వ వారం [illegible] ఆటలు

శ్రీలీలామహల్

[illegible]
GRAND CANYON TRAIL AND STILL
మూడు ఆటలు

★ ఆంధ్రదేశమంతటా నేడే విడుదల

విజయవాడ	శ్రీ లక్ష్మి టాకీస్	బళ్లారి	ముబారక్ టాకీస్
విశాఖపట్నం	శ్రీలక్ష్మి టాకీస్	కర్నూలు	విక్టరీ టాకీస్
గుంటూరు	శ్రీలక్ష్మీపిక్చర్ ప్యాలెస్	కడప	శ్రీసరస్వతీ టాకీస్
విజయనగరం	శ్రీ కృష్ణా సినిమా	అనంతపూర్	శ్రీకాంతం టాకీస్
కాకినాడ	క్రౌన్ టాకీస్		
రాజమండ్రి	అశోక మహల్	త్వరలో	
ఏలూరు	శ్రీ పాండురంగా టాకీస్		
తెనాలి	రత్నా టాకీస్	గుడివాడ	శ్రీనివాస సినిమా
నెల్లూరు	శేషమహల్	చీరాల	మోహన్ థియేటర్
మచిలీపట్నం	మినర్వా టాకీస్	తణుకు	శ్రీచిత్తూరిమారుతీసినిమా
భీమవరం	మారుతీ టాకీస్	పాలకొల్లు	రత్నం టాకీస్

డిస్ట్రిబ్యూటర్సు!

ఆంధ్ర: వినోదా పిక్చర్సు సర్క్యూట్, విజయవాడ
సీడెడ్: నవయుగ ఫిలింస్, గుంతకల్లు
నైజాం: ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాద్

కథా సంగ్రహము:

ప్రపంచంలో పుట్టిన ప్రతిప్రాణి గిట్టుతుంది [illegible] నాకెన్నడూ భయంలేదు. పైగా బాధ భరించలేక కావాలని చావుకోసం [illegible] నాకా విచారం లేనేలేదు. నన్ను ఏడిపిస్తున్న బాధల్లా ఒక్కటే; ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టే తరుణంలో మనసు నిర్మలంగా ఉండాలి. తానెవరికీ ఏ విధమైన అన్యాయమూ చేయలేదని, తన ధర్మాన్ని సత్యసమ్మతంగా పాలించానని ఆత్మతృప్తితో ప్రాణవాయువు మరలిపోవాలి. ఆ మానవుడు మరణించిన తర్వాతి సమాజం చెప్పుకోవాలి. ఆ నిర్ణయమే మానవ జీవితాలమీద దేవుడుచేసే తీర్పు. ఒకనాడు "దేవదా! నిన్ను ఎవ్వడైనా మన్నిస్తాడా" అని పార్వతి నన్ను నిష్ఠురాలాడింది. మీరే చెప్పండి నేను తప్పు చేశానేమో.

మా నాన్న నారాయణరావుగారు గొప్పజమీందారు. ద్విజదాసు మా అన్నగారు. మా అమ్మ బలవంతాన మా అన్నయ్యకు చిన్నతనంలోనే పెళ్ళిచేశారు, అసలే అబ్బరాల కొడుకేమో వివాహంతోనే చదువుకు స్వస్తి చెప్పాడు. ఆ నిరుత్సాహంతో మా నాన్నగారు నన్ను శ్రద్ధగా చదివించి చాలా గొప్పవాణ్ణి చేయాలని ఆశపడ్డారు. [illegible] నాతోపాటు పార్వతి మా బళ్ళోనే చదువుకునేది. ఆమె మా పొరుగింటి నీలకంఠంగారి కూతురు. వారిది పేదకుటుంబమైనా, మా కుటుంబంతో ఎంతో మచ్చికగా ఉండేవారు. మాకు ఆడపిల్లలు లేరేమో, మా అమ్మా నాన్నా కూడా పార్వతిని ఎంతో మురిపెంగా చూసేవారు. నాకు పార్వతియంటే అమితాభిమానం. ఒక్కచెట్టుమీదపుట్టి, ఒక్కపళ్ళెంలో చదువుకుంటూ ఒక్కటిగా ఉండేవాళ్ళం. పార్వతికూడా అంతే; నేనంటే [illegible] నేను చిన్నతనంనుంచీ దుడుకువాణ్ణే. మా నాన్నకోపం, మా అమ్మగారి గారాబం నాకు పుటకతోనే వచ్చినై. చదువుకూడ [illegible] ఆటలంటే సరదా యెక్కువ. ఏదోరకంగా బడిమానేసి తోటలో ఆటలలో నేనూ పార్వతీ ఆటపాటలతో ప్రొద్దుపుచ్చేవాళ్ళం. కొట్టినా తిట్టినా నేనే లోకమని దేవులాడేది. ఒకనాడు బడిపెద్దను సున్నంగుట్టలో తోసేసి నేను తోటలోకి పరిగెత్తాను. బడిపంతులు గోవిందయ్య మా నాన్నగారితో చెప్పాడు నా అల్లరంతా. నన్ను బడిమానిపించి ఇంటిలోనే కూలేసి చదివించాలనికూడా ప్రయత్నించారు. నేను కాలుకుదిరి కూర్చుంటేగా. మామూలు చొప్పున తోటలో పార్వతీ నేనూ ఆడుకునేవాళ్ళం. ఇక ఊళ్లో ఉంచితే లాభంలేదనీ, అన్నకు అన్నివిధాలా తమ్ముణ్ణి [illegible] మా నాన్నగారు నిశ్చయించుకున్నారు. మా నౌకరు ధర్మన్నను నాకు తోడుచేసి చదువుకోసం పట్నంలో కాపురం పెట్టించారు. నేను వెళ్ళిన తరువాత పార్వతికూడా బడిమానివేసి యింట్లోనే పనిపాటా నేర్చుకుందట.

అది క్రొత్తచోటు కావటాన, చదువుతప్ప మరే ఆకర్షణా లేనందువల్లా చదువులో సరదాకల్గింది. చరాచరా కాలంతోపాటు చదువూ సాగిపోయింది. కొన్నేళ్ళవరకూ నేను మావూరే వెళ్లలేదు. ఒక యేడు వేసవి సెలవులకు మావూరు వెళ్ళాను. మా యింటికి వెళ్ళేదారిలోనే నీలకంఠంగారిల్లు. సరాసరి యింట్లోకి వెళ్ళాను. నాలాగే పార్వతికూడా పెద్దపిల్లయింది. నన్ను చూసి సిగ్గుతో తలవంచుకుంది. ఆ సాయంకాలం తోటలో మామూలుగా కలుసుకున్నాం. ఏళ్ళు వచ్చాయన్న మాటేగాని చిన్నతనంలో ఏ మనసులతో ఏ చూపులతో ఎలా సంచరించామో ఆనాడుకూడా అలాగే వెళ్లిపోయింది.

మా ముచ్చట్లూ, మురిపాలూ తెలిసిన పార్వతి నాయనమ్మ మాయింటికి వచ్చి మాటలవరసన మా పెళ్ళిప్రసంగం తెచ్చింది. మా అమ్మ వెకిలిగా నవ్వి ఆ మాటత్రోసిపుచ్చింది. ఆ నవ్వులో అర్థం ఆ ముసలమ్మకేం తెలుసు. ఎలాగైనా

నాగేశ్వరరావు

పెద్దబాబుతో చెప్పి [illegible] వెళ్లిపోయింది. మా నాన్నగారితో యీవిషయం చెప్పబోతున్నప్పుడు మా అమ్మగారి నవ్వులోగల భావం బైటపడింది. వారు కులంలేనిమనుష్యులు; పిల్లల్ని అమ్ముకునేవారు; ఆ సంబంధం ఆమె ఎలాఅంగీకరిస్తుంది.? కాని మా నాన్నగారు [illegible] జోక్యం కలిగించుకోవద్దని నీలకంఠంగారిని [illegible]. కొండంత ఆశతో వారు వచ్చారు. పర్యవసానం తీరని అవమానం. కుండ బ్రద్దలుకొట్టినట్టు తమ మనసులో ఉన్న అనుమానాలన్నీ వీకరువుపెట్టి కలలోకూడా యీ పెళ్ళి కాదనీ-ఇంకెన్నడూ యీ ప్రస్తావన తేవద్దని పంపించారు. మండుతూన్న గుండెతో ఇంటికివెళ్ళి ఆయన తల్లిగారిని నానామాటలూ అని, మా తలదన్నే సంబంధం తెస్తానని ప్రయాణమై [illegible]. పాపం! పార్వతికి ఏమీ పాలుపోక ఆ రాత్రి ఒంటరిగా మా యింటికివచ్చి, తన బాధంతా వెళ్ళబోసుకుని, నీ కాళ్ళదగ్గర కాస్త చోటియ్యి దేవదా! అని [illegible]. నాకు ఏంచెప్పాలో తోచలేదు. రేపు సమాధానం చెపుతానన్నాను.

మనసు విచ్చి మా నాన్నగారితో మాట్లాడితే వింటారని ఆశపడ్డాను. అరమరలేకుండా అన్ని సంగతులూ వారితో మనవిచేశాను. మనసు మార్చుకోకపోగా ఒక్కమాటతో సమస్య తేల్చివేశారు. తరతరాల వంశ మర్యాద నా కుమకారంకోసం నాశనం కారాదనీ, కన్న తండ్రో - ప్రేమించిన కన్నెపిల్లో ఒక్కరే [illegible] దక్కుతారనీ, నా ప్రేమా, నా స్వర్గమే నా జీవిత సర్వస్వమనుకుంటే - తనను చంపి పెళ్ళాడమనీ శపథాలు అందించారు. నా ధైర్యం నీరయిపోయింది. ఒళ్ళంతా వణికిపోయింది. నాకళ్ళు మూసుకుపోయినై. అక్కడ ఉండలేకపోయాను. పట్నం వెళ్లిపోయాను.

కాని-పార్వతి నా సమాధానంకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఏం చెప్పాలో మరి? పరిపరివిధాల ఆలోచించాను. పార్వతి ప్రేమకోసం తల్లిదండ్రులను వదలుకోవడమా, తల్లిదండ్రుల పట్టుదలకు పార్వతి అనురాగాన్ని బలి చేయడమా? చివరికి పార్వతికి జాబు వ్రాశాను. తల్లిదండ్రుల మాట కాదని నేను పెళ్ళాడలేననీ, ఆడినా ఆ పెళ్లివల్ల ఎవరమూ సుఖపడలేమనీ, నీ వింకెవరినైనా పెళ్ళాడమనీ, నన్ను మరచిపొమ్మని వ్రాశాను. ఆ ఉత్తరం చదువుకుంటే నా పార్వతి కుమిలి కూలిపోతుందని నాకు తెలుసు. కాని గత్యంతరంలేదు.

ఆ ఉత్తరం చూచుకుని నిజంగా పార్వతి బావురుమంది. [illegible] మోసం చేశానని భావించింది. అందుకు తగినట్టే నీలకంఠంగారు దుర్గాపురం జమీందారు భుజంగరావుగారితో [illegible] వచ్చారు.

ఆ ఉత్తరం వ్రాసిన తర్వాత నా స్నేహితుడు భగవాన్‌తో నా పెళ్ళి విషయమై చర్చించాను. నా తప్పు తెలుసుకున్నాను. సమయంపట్ల సాహసించలేక స్వర్గాన్ని చేతులారా జారవిడుచుకున్నానని విచారపడ్డాను. అవకాశం ఉండగానే రక్షించుకుందామని అమాంతంగా బయలుదేరి మావూరికి కదిలాను. ఏంలాభం! తీరా నేను మావూరు చేరేవరకే వ్యవహారం చేయిదాటిపోయింది. కావలసిందంతా అయిపోయింది. నీలకంఠంగారు వివాహముహూర్తంకూడా నిశ్చయించుకొని వచ్చేశారు. వయసుమళ్ళిన రెండోపెళ్ళి వానికి పిల్లనివ్వటానికి ఆడవాళ్ళు పేచీపెట్టినా, అన్నమాట జరగాలిసిందేనని ఆయన మొండిపట్టు పట్టాడు. నా కూతురైతే నా అవమానం తనదనుకుంటే ఈ సంబంధం పార్వతి కాదనదని సవాలుచేశాడు. మనసారా ప్రేమించిన నేను మోసంచేశాను. నన్ను నమ్ముకుని కూచుంటే ఏనాటికైనా ఆదరిస్తానన్న ఆశాలేశంకూడా మిగల్చలేదు. తన సౌఖ్యం దగ్ధమైపోయింది. తన జీవితంతోపాటు తండ్రి మర్యాదకూడా పాడుచేసి సాధించేదేముంది? గత్యంతరం లేక పార్వతి ఆ సంబంధానికి తల ఊపింది. ఆ ముహూర్తానికే వివాహం ఖరారని నిశ్చయించుకున్నారు.

అదే సమయానికి- నేనూ వారి గడపలో కాలుపెట్టాను. పదినిమిషాలు ముందుగా చేరగలిగితే ఏమయ్యేదో. ఆ మాట వినే వరకు నా ప్రాణాలు ఎగిరిపోయినయి. అలాగే యింటికి వెళ్ళాను. పార్వతిస్వభావం నాకు తెలుసు, చాలా ధైర్యంగలపిల్ల. ఆమెను ఒప్పించి యీ పెళ్ళి తప్పించాలనే సంకల్పంతో ఆమెను కలుసుకొన్నాను. నా పొరపాటు మన్నించమని-ఏమైనాసరె-ఎవరడ్డమైనాసరే పెళ్లాడుతానని చెప్పాను. ఆమె నన్ను నిష్ఠురాలాడింది. ఈ మాట ముందే చెప్పలేకపోయినందుకు దెప్పింది. అన్నమాట తప్పలేనంది. నాకు పట్టరాని ఆవేశం వచ్చింది. పసితనంలో చేసినట్టే - కాబోయే పెళ్లికూతుర్ని పట్టుకుని కొట్టేశాను. పెపేలని తలచిట్లి నెత్తురు చిమ్మింది. నెత్తురు కంటపడగానే యిద్దరి ఆవేశాలూ మంచులాగా విచ్చిపోయినై. అనుబంధం గాఢతరమైంది. ఆమెకు మిగిలిందల్లా మాయని ఆ మచ్చే. నాకు మిగిలింది ఆరని ఆవేదన. కన్నీళ్ళతో యిద్దరం విడిపోయినాం. ఆమెకు అనుకున్న ప్రకారం పెళ్ళయిపోయింది. నా పార్వతి పరాయిదైపోయింది. నా జీవితం చీకటైపోయింది. ఆమె అత్తవారింటికి-నేను పట్నానికి మోయలేని శోకంతో వెళ్ళిపోయినాం. ఇద్దరివీ యిరుదారులు. ఒక్కటిగా నడచిన మా జీవితాలు, హృదయాలు రెండైపోయినయి - ఎన్నటికీ అవి ఏకంగాలేవు ఎన్నటికైనా, అవి కలుసుకున్నా - అవి రెండేగాని ఒక్కటి కాలేవు.

కలయేదో నిజమేదో కనుక్కోలేని కలవరంతో పట్నంచేరి-తిరిగి తిరిగి యిల్లు చేరుకున్నాను. అక్కడమాత్రం నాకేముంది? బదాబద్దలైపోయిన నా హృదయాన్ని అది పదిలపరుస్తుందా? మాయని మనోవేదన మరపిస్తుందా- వెలుగారిపోయిన జీవితానికి విశ్వాసాన్ని యిస్తుందా? తాడుతెగిన గాలిపటం వలె అంతులేని ఆకాశంలో యెగిరి యెగిరి ఏ క్షణంలోనో ఎక్కడనో-చినిగి నేలకూలిపోవలసిందేగా - భరించలేని ఈ బాధతో బ్రతుకంటే చావనే [illegible] కళ్ళకు కనిపిస్తే కౌగలించుకోవాలనిపించేది.

నా స్నేహితుడు భగవాన్ నా దీనస్థితిని అర్థంచేసుకున్నాడు. లోకం శోకమయం కాదనీ, సుఖం చూపిస్తాననీ చెప్పి, ఒక ఇంటికి తీసుకువెళ్ళాడు.

అది చంద్రముఖి అనే వేశ్య యిల్లు. ఆ వాతావరణం, ఆమె వైఖరి చూడగానే నాకు అసహ్యం వేసింది. పాడు డబ్బుకోసం అభిమానం, అందం అంగడిలోపెట్టి అమ్ముకొనే ఆమె నా కానందం కలిగిస్తుందా-పవిత్రమైన పార్వతి ప్రేమతో నిండిన నా హృదయానికి ఆ తలపే అవమానంగా తోచింది. డబ్బు ఆమె ముఖాన కొట్టి వచ్చేశాను. ఆమె నివ్వెరపోయింది.

కాని పుండుమీద కారంచల్లినట్లయింది. ఆ సంఘటన నా హృదయంలో పార్వతిని మరీ కెలక వేసింది. మనసు మసిలిపోయింది. ఆరనిమంట — తీరని వేదన. విషమయినా త్రాగి చద్దామనిపించింది. భగవాన్‌ను అడిగాను. మందని చెప్పి అతడు బ్రాంది యిచ్చాడు. త్రాగి పడుకున్నాను. మైమరచి ఆ రాత్రంతా హాయిగా నిద్రపోయాను. తెల్లవారింది. తెలివి వచ్చింది. పార్వతి మళ్ళీ కళ్ళల్లో మనసులో మెదలడం మొదలుపెట్టింది. మళ్లీ మంట. భగవాన్‌ను తిరిగి ఆ మందిమ్మని ప్రార్థించాను. అది బ్రాందీయని, మాన ప్రాణాలు హరిస్తుందనీ-ససేమిరా యివ్వనని మొండికేశాడు, దాని కలవాటు కావద్దని గడ్డం పట్టుకు బతిమాలాడు. నేను వినలేదు. వెళ్లి నేనే బ్రాందీ త్రాగేశాను. అది మొదలు అహోరాత్రాలూ-అన్నమూ నీళ్లూ అదే. పార్వతి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా త్రాగేవాను. తెలివిలేదు. చలిమిలేదు. నాకు ఉండీ మిగిలిందీ ఆ ఒక్కటే.

పార్వతి కూడా పెళ్ళాడి సుఖంగాలేదు. తండ్రిమాట నిలపాలని ఆమె పెళ్లాడిందేకాని సుఖపడాలనీ సుఖపడలేననీ కాదు. భుజంగరావుగారుకూడా అంతే. వారిది పెద్ద సంసారం. పార్వతికంటే పెద్దా చిన్నా పిల్లలున్నారు. అందరినీ పెంచి-యిల్లు చక్కపెట్టే యిల్లాలు వారికి కావాలి. ఇంటికి వెళ్లగానే పార్వతికి వారా సంగతులన్నీ వివరించి అభారం మీదవేశారు. పార్వతికూడా ఆ బరువును మనఃపూర్వకంగా అంగీకరించింది, తన విధ్యుక్తధర్మాన్ని ఆయింటి కోడలైనందుకు చక్కగా నెరవేర్చితీరాలి. తన ప్రేమతో ఆ చిన్నవాళ్లకు తల్లిలేని కొరత మరపించింది. తండ్రిపై అలిగిన పెద్దకూతురును రప్పించి—కల్లదలిక—సంతోషపెట్టింది. కొడుకునూ, కోడలినీ చక్కదిద్ది వారి కాపురం కుదుటపడేసింది. ఆ భర్త ఆనందానికి అంతులేదు. ఆయనేకాదు, ఆమెను పెళ్ళాడిన ఏ వ్యక్తియైనా అలాగే సుఖపడేవాడు. ఇందరికి ఇన్ని విధాల శాంతి కలిగించగలిగినా ఆమెకు శాంతిలేదు. నన్నామె మరచిపోలేదు. ఎలా సాధ్యం!

నేనూ అంతే. ఇలాటిదే చంద్రముఖివాడానని నాకు తెలియదు. ఒకనాడు భగవాన్ నన్ను చంద్రముఖి ఇంటికి రమ్మన్నాడు. బలవంతపెట్టి తీసుకుని వెళ్ళాడు. ఆమె నన్నెంతో ఆప్యాయంగా ఆదరించింది ఆనాడు ఆమె పూర్వపు చంద్రముఖి కాదు. పూర్తిగా వేషంలో, వృత్తిలో, మనసులో, మారిపోయింది. తన గోడంతా నాతో చెప్పుకుంది. ప్రేమంటే పసిక్రీడగా భావించే ఆమె [illegible] ఆశ్చర్యం వేసింది. కాని నేనేమి చెయ్యగలను! నా శరీరం మనసూ పరిపూర్ణంగా పార్వతివే గాని నాటిమీద నాకేమీ స్వతంత్రంలేదు. ఆ మాటే నిష్కర్షగా ఆమెతో చెప్పివేశాను. నా నిష్కపటత్వం ఆమెను మరి ఆకర్షించింది. నన్ను సేవించడమే పరమ భాగ్యంగా ఆమె భావించింది. నేను మాత్రం పాపం చేయటానికి ఒకటి వెతుక్కున్నట్లు, ఆమె యింటికి అడపాదడపా త్రాగటానికి వెళ్లేవాణ్ని - అంతేగాని అనురాగం ఏ కోశానాలేదు.

ఒకరోజు చంద్రముఖి యింటిలో ఉండగానే ధర్మన్నా వచ్చి మా తండ్రిగారి మరణవార్త చెప్పాడు. వెంటనే బయలుదేరి మా వూరు [illegible] గతించారు. కార్య కలాపాలన్నీ గడిచిపోయినాయి. అన్నదమ్ములం ఆస్తిపాస్తులు లెక్కచూసుకోవాలనుకున్నాం. కాని పెళ్ళి పేరంటంలేని బ్రహ్మచారికి నాకెందుకూ ఆ ఆస్తి, ఆ బాదరబందీ? అన్నకే తీసుకుని, నా కన్నులకు మాత్రం కావలసిన సొమ్మున్నాను. ఇంటి గొడవలు సరిపుచ్చుకునే [illegible] పార్వతి పుట్టింటికి వచ్చింది-మాకు కలిగిన ఆపద విని నన్ను చూడాలని వచ్చింది ఆమె వాలకం, ఆ ఔదార్యం చూసి నే నాశ్చర్యపడ్డాను. ఆమె నా కండగా ఉంటే-ఈ బాధలేమీ మాకుండేవి కావు - ఆ మాట అనేవరకు ఆమె కన్నీళ్ళ కాలువైపోయింది. మాటల ధోరణి మార్చేశాను. ఎవరినైనా పెళ్లాడమనీ - తమ యింటికివచ్చి ఉండమనీ ఏమేమో చెప్పింది-నేనేం పిల్లవాణ్ణా! వదలమనుకుంటే ఎప్పుడో పెళ్లాడేవాణ్ణి. ఆ యోగం నాకులేదు. చచ్చిపోయేలోగా వారింటికి తప్పకుండా వస్తాననిమాత్రం వాగ్దానంచేశాను. అంతటితో ఆమె కోర్కెలు పూర్తికాలేదు. త్రాగుడు మానమన్నది: ప్రమాణం చెయ్యమంది. అన్నీ పోగొట్టుకున్న నాకు ఉన్నదల్లా అదొక్కటే. దానివల్లనే బాధ తెలియకుండా బ్రతుకుతున్నది-అదికూడా మానేస్తే!-నా బాధ ఆమె తెలుసుకుంది-కన్నీళ్లతో వెళ్లిపోయింది. ఆమెకోరికలోగల మంచితనం, సానుభూతి నాకు తెలుసు త్రాగుడు వల్ల నా ఆయుర్దాయం హరించిపోతున్నదని నేనెరుగుదును. కాని ఏంచెయ్యను. ఆమె ప్రేమకోసం బ్రతకాలి - బాధ కనిపించకుండా ఉండాలి - త్రాగుతూనే ఉన్నాను. ఒకనాడు ఆ మైకంలో తోటచాయల పార్వతి స్నేహితురాలు మనోరమ కనిపిస్తే పార్వతని ఆమె చేయి పట్టుకున్నాను. ఆ సంగతి మనోరమ పార్వతికి వ్రాసిందట. ఆమె నన్ను చూడాలని పరుగెత్తుకుంటూ మళ్ళీ మా వూరు వచ్చిందట. కాని నేనక్కడ ఉంటేగా.

ఆచోటు ఉండడం చేతకాలేదు. పట్నానికి వచ్చేశాను. ఇక్కడ మాత్రం చేసేదేముంది. విచ్చలవిడిగా త్రాగడం మొదలుపెట్టాను. వద్దనేవాళ్లా-అడ్డుపడేవాళ్ళా? మద్యంలో మునిగి తేలుతూన్నాను.

అలాగా చంద్రముఖివలన భగవాన్ తెలివిగలవాడైనాడు. పట్నం విడిచి వెళ్ళిపోయాడు. ఒకసారి ఎందుకో అతన్ని చూడాలనిపించింది. ఎవరు చెపుతారు అతని జాడ. చంద్రముఖి ఇంటికి వెళ్లాను. ఆమె ఎంతో ప్రేమతో ఆహ్వానించి-మళ్లీ తన మనసు వెళ్లబోసుకుంది. మంది ఒక్కటేమాట. చివరికి ఈ త్రాగుడైనా మానమని బ్రతిమాలింది. ఈ పట్నంవిడిచి మీవూరు వెళ్లమంది. కాదనలేక సరేనని సమాధాన పెట్టి వచ్చేశాను.

కాని - ఆ వూరు వెళ్లగలనా, అక్కడ నాకేముంది వెళ్లడానికి? ధర్మన్నను డబ్బుతెమ్మని మావూరికి పంపించి నేనక్కడే ఉండిపోయాను. వెర్రి త్రాగుడుతో కడుపులో పుండు పుట్టింది. ఆపరేషన్ చేయించాను. అయినా ఆ త్రాగుడు మాత్రం మానలేక పోయాను.

ధర్మన్న డబ్బుతీసుకుని తిరిగి వచ్చేశాడు. నేను కనిపిస్తేగా- ఇంటివైపులకే రాలేదు. చంద్రముఖిని కలుసుకుని - నాకోసం పట్నమంతా వెతికారట. రోడ్డు ప్రక్కన మైకంలో పొర్లుతూంటే చూసి ఇల్లు చేర్చారట. మర్నాడు

సావిత్రి

విన్నాను చంద్రముఖి నన్ను ఎంతో బాధతో మందలించింది; ఇన్నివిధాల చెప్పినా వినకుండా ఈ పని చేస్తున్నందుకు, పొట్టపై కట్టు - దగ్గినప్పుడు కళ్ళలోపడ్డ నెత్తురుచుక్కలు; చూడగానే ఆమెకు గుండె గుభిల్లుమంది. డాక్టరుకు కబురు చేసింది.

వచ్చి పరీక్ష చేశాడు. ఏమంటాడు -పెదవి విరిచాడు. సాధ్యమైనంత తెలియకుండా ఉండాలని నెమ్మదిగా చంద్రముఖికి చెప్పాడు. అట్టేకాలం జీవించదనీ - సొంత ఊరికి పంపించమనీ అన్నాడు. పొంగి పొరలే దుఃఖాన్ని దిగమ్రింగుతూ కళ్ళనీళ్లు కనిపించకుండా - నన్ను ఊరికి వెళ్ళమనీ - గాలి మార్పు కావాలనీ నచ్చచెప్పింది. సరేనన్నాను. పట్నం విడిచి బయలుదేరాను. కాని ఇంత త్వరగా ముంచుకొస్తుందనుకోలేదు. రైలులో దగ్గు - వాంతి వచ్చినయి. నోటి వెంట విపరీతంగా నెత్తురుపడింది - అప్పుడు నా వ్యవహారం [illegible] వచ్చిందని తెలుసుకున్నాను. ఈ నిర్ణయానికి వచ్చేసరికి దుర్గాపురం రైలు స్టేషను వచ్చింది. పార్వతి కిచ్చినమాట జ్ఞాపకం వచ్చింది. ఆ మాట చెల్లించకపోతే ఆమె ఉన్నన్నాళ్ళు కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. ఆమెను కళ్ళారా చూడాలని అక్కడ దిగి దుర్గాపురానికి బయలుదేరాను. తలవని తలంపుగా వచ్చిన గాలీ వానా — చలీ - వచ్చినయి. నన్నా ఊరికి చేరనిస్తాయో లేదో - ఏమైనాగానీ- అంతకంటే నాకేమీ ఆశలేదు. కడసారి ఆమెను చూసి ఆమె కళ్లెదుట పోతే - నా బాధంతా ఫలించి స్వర్గధామం దొరికినట్లే. నా అదృష్టం ఎలా రాసిపెట్టివుంటే అలా అవుతుంది. ఇక ఏమైనా విచారంలేదు.

కాని—ఈ మాట చెప్పండి కన్న తల్లిదండ్రులకు కాదని పెళ్లాడమన్నారా? చిన్నతనంనుంచి ప్రేమించుకుని నమ్ముకొన్న [illegible] పార్వతి ఆశలు అడియాసలుచేసి మరొకర్ని పెళ్లాడి ఆమె కాను, మీరు మెచ్చుకుంటారా? త్రికరణశుద్ధిగా-పార్వతిదనుకుంటూన్న యీ శరీరాన్ని చంద్రముఖి అనురాగానికి వెలపోస్తే దేవుడు ఒప్పుకుంటాడా- ప్రేమించడం ఎరిగినవాళ్లు మెచ్చుకుంటారా? అందుకే నా భాగ్యమనుకున్నాను. అది మరువటానికే మద్యానికి దాసుడనైనాను. అది మానలేకనే ప్రాణాలు బలిచేస్తున్నాను. కాని ఎవరినీకోరి, ధిక్కరించలేదు. కావాలని మోసం చేయలేదు. వ్యసనం కోసం త్రాగలేదు. ఇవంతా ప్రేమించినందు-ప్రేమంటే ఏమిటో తెలిసి - అపవిత్రం చేయలేనందుకే - నాది నిజమైన ప్రేమని మీరు నమ్మితే నేను తెలియక చేసిన పొరపాటేమైనా ఉంటే-మీరు నన్ను మన్నించరూ!

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త.— కాట్రగడ్డ రాజగోపాలరావు, ముద్రణ:— స్వతంత్ర కన్సర్న్స్ లిమిటెడ్ వారి స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, బకింగ్‌హాంపేట, విజయవాడ. సంపాదకవర్గం.— మద్దుకూరి చంద్రశేఖరరావు [అధ్యక్షుడు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు